మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
Circulated to Telangana

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 1-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 302 Issue: 302

01 మే 2026 - శుక్రవారం, శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం - వసంత ఋతువు, వైశాఖ మాసం - శుక్లపక్షం, సూర్యోదయం - తె. 5:54, సూర్యాస్తమయం - సా. 6:32, తిథి, పౌర్ణమి రా. 10:54 వరకు, తరువాత పాడ్యమి, సంస్కృత వారం, భృగు వాసరః, నక్షత్రం, స్వాతి తె. 4:300 వరకు, తరువాత విశాఖ, యోగం, సిద్ధి రా. 9:09 వరకు, కరణం, విష్టి ఉ. 10:01 వరకు, బవ రా. 10:54 వరకు, వర్జ్యం, ఉ. 8:24 నుండి ఉ. 10:09 వరకు, దుర్ముహూర్తం, ఉ. 8:25 నుండి ఉ. 9:16 వరకు, మ. 12:38 నుండి మ. 1:29 వరకు, రాహుకాలం, ఉ. 10:38 నుండి మ. 12:13 వరకు, యమగండం, మ. 3:23 నుండి సా. 4:57 వరకు, గుళికాకాలం, ఉ. 7:28 నుండి ఉ. 9:03 వరకు, బ్రహ్మముహూర్తం, తె. 4:18 నుండి తె. 5:06 వరకు, అమృత ఘడియలు, సా. 6:55 నుండి రా. 8:41 వరకు, అభిజిత్ ముహూర్తం, ఉ. 11:48 నుండి మ. 12:38 వరకు, గమనిక: "o" అనగా మరుసటి రోజున

www.evarthalu.com




## పాతాళానికి రూపాయి

**డాలర్‌తో రూ.95.20కు చేరిక**

దేశీయ కరెన్సీ రూపాయి గురువారం భారీ పతనాన్ని నమోదు చేసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 95 మార్కును దాటి చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయింది.


› 2



## క్రూడాయిల్ బ్యారెల్ 126 డాలర్లు

**2022 తర్వాత అత్యధిక స్థాయి**

**ట్రంప్ 'దిగ్బంధనం' వ్యాఖ్యలతో ఎఫెక్ట్**



న్యూఢిల్లీ: గ్లోబల్ చమురు ధర గురువారం బ్యారెల్‌కు 126 డాలర్లకుకి చేరి, 2022 తర్వాత అత్యధిక స్థాయిని తాకింది. ఇరాన్ నౌకాశ్రయాలపై అమెరికా దిగ్బంధనం నెలలపాటు సాగుతుందని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, శాంతి చర్చలు నిలిచిపోవడమే ఈ పెరుగుదలకు కారణం. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 24 గంటల్లో 13 శాతం పైగా పెరిగి, ఫిబ్రవరి 28న యుద్ధారంభం నుండి గరిష్టానికి చేరింది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సమయంలో 139 డాలర్లకు చేరిన బ్రెంట్, మళ్ళీ 120 డాలర్లను దాటింది. ఇరాన్ నౌకాశ్రయాలపై యూఎస్ దిగ్బంధనాన్ని కొనసాగించడానికి ట్రంప్ సిద్ధపడటంతో చమురు మార్కెట్లు ఆందోళన చెందాయి. దీనికి ప్రతిస్పందనగా, ఇరాన్ హార్ముజ్ జలసంధిని ఇతర ట్యాంకర్లకు మూసివేసింది. దౌత్య పరిష్కారంపై ఆశావాదం నుండి, వాణిజ్యులు - తరువాయి 2 వ పేజీలో...

## తెలంగాణ రాష్ట్ర సేన కాదు.. తెలంగాణ రక్షణ సేన

**టీఆర్ఎస్ మాత్రం కవితకే సొంతం**

**కొత్త పార్టీకి ఎన్నికల సంఘం పచ్చజెండా**

**కవితకు లేఖ అందజేసిన అధికారులు**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్థాపించిన కొత్త రాజకీయ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అధికారికంగా ఆమోదముద్ర వేసింది. కవిత పార్టీకి 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) అనే పేరును ఖరారు చేస్తూ సీఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎన్నికల సంఘం అధికారులు బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి వెళ్లి అధికారిక లేఖను అందజేశారు. ఈ నెల 25న

- తరువాయి 2 వ పేజీలో...

## బట్టలు.. బుక్కులు

**అన్నీ నాణ్యమైనవే ఉండాలి**

- విద్యార్థుల సామగ్రిపై సీఎం ఆదేశాలు
- ఏకరూపతకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్
- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్



**విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో

- తరువాయి 2 వ పేజీలో...



## బెంగాల్ గరం గరం

**కుట్రలతో గెలవాలని బీజేపీ యత్నం**

**గెలిచేది మేమే.. 226 సీట్లు మావే**

**ఎగ్జిట్ పోల్స్‌పై మమత ఆగ్రహం**

**రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ స్పందించారు. ఇవన్నీ బీజేపీ ఆఫీసు నుంచి వచ్చినవని ఆమె విమర్శించారు.**

కోల్‌కతా: మళ్లీ తామే విజయం సాధిస్తామని, కచ్చితంగా 226 సీట్లలో గెలుస్తామని డంకా బజాయించారు. మే 4న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత టీఎంసీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని మమతా బెనర్జీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో తమ పార్టీ ఎటువంటి జిమ్మిక్కులను అనుమతించదని ఆమె అన్నారు."ఎగ్జిట్ పోల్స్ బీజేపీ ఆఫీసు నుంచి వచ్చినవి.. టీఎంసీ కార్యకర్తలను నిరుత్సాహపరిచేందుకే ఈ నెంబర్లను తారుమారు చేశారు" అని బెనర్జీ ఒక వీడియో సందేశంలో అన్నారు. తన నియోజకవర్గమైన

- తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,066 |
| వెండి (గ్రాము): | రూ.270 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,827 |

## 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్



**ఉస్మానియా హాస్పిటల్ డాక్టర్ల అరుదైన ఘనత**

**10 కిలోల బరువున్న చిన్నారికి 240 గ్రాముల లివర్ అమర్చిన వైద్యులు**

**14 గంటల పాటు కొనసాగిన శస్త్ర చికిత్స.. నిలకడగా బాలుని ఆరోగ్యం**

**దేశంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యంత అరుదుగా ఈ తరహా ఆపరేషన్లు**

**డాక్టర్లను అభినందించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ఉస్మానియా జనరల్ హాస్పిటల్ డాక్టర్లు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. గ్లైకోజెన్ స్టోరేజ్ అనే అరుదైన డిసీజ్‌తో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. కేవలం 10 కిలోల బరువు ఉన్న బాలునికి.. సుమారు 14 గంటల పాటు శ్రమించి 240 గ్రాముల లివర్ అమర్చారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని శస్త్ర చికిత్స బృందానికి నేతృత్వం వహించిన డాక్టర్ మధుసూదన్ వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి చెందిన మహ్మద్ ఇర్ఫాన్, సాజియా దంపతుల 18 నెలల - తరువాయి 2 వ పేజీలో...




## చల్లని చిరు జల్లులు!

**మూడ్రోజులు వానలు.. ఎండల నుంచి ఉపశమనం**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): మండే ఎండలతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రస్తుతం దక్షిణ కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మున్నార్ గల్ఫ్ వరకు సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఈ ఉపరితల ద్రోణి విస్తరించి ఉన్నట్టు వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గురువారం నుంచి శనివారం వరకు రెండు రాష్ట్రాల్లోని - తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




జపాన్ శాస్త్రవేత్తలు అద్భుతం చేశారు. ల్యాబ్‌లో కృత్రిమ రక్తాన్ని సృష్టించారు. ఈ రక్తం అన్ని గ్రూప్‌ల వారికి పనికొస్తుంది. ఈ రక్తం ఎక్కించుకున్నా ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు.

## భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి

**ఘనంగా పదవీ విరమణ వేడుకలు**



**డీజీపీగా పదవీ విరమణ చేసిన శివధర్ రెడ్డి రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమితులయ్యారు. జీవో నెం. 559 ద్వారా ప్రభుత్వం ఆయన నియామకాన్ని ఖరారు చేసింది. చీఫ్ సెక్రటరీ హోదాలో మూడేళ్ల పాటు శివధర్ రెడ్డి ఈ పదవిలో కొనసాగనుండగా.. ఆయనకు నెలకు రూ. 2.25 లక్షల వేతనం అందనుంది.**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): శాంతిభద్రతలు, నేర నియంత్రణ, నార్కోటిక్స్ నియంత్రణలో ప్రభుత్వానికి ఆయన సలహాలు అందించనున్నారు. ఆయన కోసం హోంశాఖ ప్రత్యేక కార్యాలయాన్ని, సిబ్బందిని కూడా కేటాయించింది. కాగా, అంతకుముందు రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయం వేదికగా నిర్వహించిన వీడ్కోలు వేడుక అత్యంత ఘనంగా, ఆత్మీయతతో కూడిన వాతావరణంలో సాగింది. సుదీర్ఘ కాలం పాటు పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, తనదైన ముద్ర వేసిన డిజిపి బి. శివధర్ రెడ్డి నిష్క్రమణ సమయంలో సహచర అధికారులు, సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు. కార్యక్రమ - తరువాయి 2 వ పేజీలో...

## జూన్ 16 వరకు జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పొడిగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): తెలంగాణ హైకోర్టు జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును 2026 జూన్ 16 వరకు పొడిగించింది. జీవో ఎంఎస్ నం.252, దాని సవరణ జీవో 103ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ కోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సహా మరికొందరు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ, విచారణ కొనసాగుతున్నంత వరకు అక్రిడిటేషన్ సదుపాయాలను కొనసాగించాలని వారు కోరారు. పిటిషనర్ల తరఫున అడ్వకేట్ బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా స్పెషల్ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వ

- తరువాయి 2 వ పేజీలో...

## బీసీ శాఖ సలహాదారుగా వీహెచ్

**రాష్ట్ర కేబినెట్ హోదాతో కీలక పదవి**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ హనుమంతరావు (వీహెచ్) కు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవిని కట్టబెట్టింది. రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారుగా ఆయనను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు, బీసీ వర్గాలపై ఆయనకున్న పట్టును గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రభుత్వ పాలనలో ఆయన అనుభవాన్ని వినియోగించుకోవాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నియామకంతో హనుమంతరావుకు ప్రభుత్వం ఉన్నత గౌరవాన్ని కల్పించింది. ఆయనకు రాష్ట్ర మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రొటోకాల్ ప్రకారం ఆయన అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో మంత్రులతో సమానమైన గౌరవం, ప్రాధాన్యత లభించనుంది. సలహాదారుగా నియమితులైన వీహెచ్‌కు ప్రభుత్వం కల్పించే సదుపాయాల వివరాలను జీవోలో స్పష్టంగా వెల్లడించారు. నెలకు రూ. లక్ష గౌరవ వేతనంతో పాటు ప్రత్యేక అలవెన్సులు ఉన్నాయి. ఆయన ప్రభుత్వ క్వార్టర్స్

- తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

1-5-2026

**మేషం:** మధ్యలో నిలిచిన పనులు నిదానంగా పూర్తిచేస్తారు. అవసరానికి సన్నిహితుల సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారములు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో సమస్యలను ధైర్యంగా పరిష్కరించుకుంటారు.

**వృషభం:** కొన్ని వ్యవహారాలలో ఆప్తులతో వివాదాలు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. వృత్తి వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

**మిధునం:** సంఘంలో పెద్దల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి. నూతన ఋణ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ధార్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలు అనుకూలిస్తాయి.

**కర్కాటకం:** సమాజంలో పరిచయాలు విస్తృతమౌతాయి. ఉద్యోగస్తుల జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. స్థిరాస్తి వ్యవహారాలలో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

**సింహం:** కుటుంబ పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. కొన్ని వ్యవహారాలు మధ్యలో నిలిచిపోతాయి. వ్యాపారాలలో ద్విస్వభావ ఆలోచనలు చేసి ఇబ్బంది పడతారు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. మిత్రులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

**కన్య:** దూరపు బంధువుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. చేపట్టిన పనులలో జాప్యం తప్పదు. నూతన ఋణ యత్నాలు కొంత కష్టంతో పూర్తవుతాయి. బందు మిత్రులతో మాటపట్టింపులుంటాయి. వ్యాపార వ్యవహారాలలో అలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. వృత్తి ఉద్యోగాలు కొంత సామాన్యంగా లాభిస్తాయి.

**తుల:** కుటుంబ పెద్దలతో సఖ్యతగా వ్యవహరిస్తారు. బంధు మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. భూ క్రయవిక్రయాలలో విశేషమైన లాభాలు అందుతాయి. చేపట్టిన పనిలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి,ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

**వృశ్చికం:** సమాజంలో గౌరవ మర్యాదలకు లోటుండదు. ఆప్తులతో దీర్ఘకాలిక వివాదాలు తీరి ఊరట చెందుతారు. అనుకున్న సమయానికి పనులు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలు సజావుగా సాగుతాయి. వృత్తి ఉద్యోగ విషయంలో ఉన్న సమస్యలు అధిగమిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**ధనస్సు:** సంతాన విద్యా విషయాలు నిరాశపరుస్తాయి. ఆర్థిక వ్యవహారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవ సేవ కార్యక్రమాలలో కుటుంబ సభ్యులతో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

**మకరం:** ముఖ్యమైన వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువుల నుండి అందిన ఒక వార్త నిరుత్సాహం కలిగిస్తుంది. ఋణ దాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు.

**కుంభం:** నూతన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆత్మీయులతో కీలక విషయాల గురించి చర్చిస్తారు. మిత్రుల సలహాతో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. సోదరులతో స్థిరాస్తి ఒప్పందాలు కుదురుతాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆర్థిక సమస్యల నుంచి బయటపడతారు.

**మీనం:** ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. ఋణ దాతలు నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆకస్మిక దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. సంతాన ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో అంచనాలు అందుకోవడంలో విఫలమౌతారు.

# 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

**(మొదటి పేజీ తరువాయి)**

కుమారుడు అఫన్.. గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పిల్లాడు తరచుగా ఆకలితో ఏడుస్తుండడం, మత్తుగా ఉండటం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలతో బాలున్ని తల్లిదండ్రులు ఉస్మానియా హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. డాక్టర్లు ఆ బాలున్ని పరీక్షించి, అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. రక్తంలో షుగర్ లెవల్స్ చాలా తక్కువగా ఉండడం, కొవ్వు పదార్థాలు అధికంగా ఉండటం, కాలేయం అసాధారణంగా విస్తరించి ఉండడాన్ని డాక్టర్లు గుర్తించారు. బాలుని సమస్యపై మరింత లోతుగా అధ్యయనం చేసి, అతను గ్లైకోజెన్ స్టోరేజ్ ( టైప్-3) అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నట్టుగా నిర్ధారించారు. ఈ వ్యాధి శరీరంలో గ్లైకోజెన్‌ను గ్లూకోజ్‌గా మార్చే ఎంజైమ్ లోపంతో ఏర్పడుతుందని, దీని కారణంగా శరీరంలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించుకోలేకపోవడం, తరచూ హైపోగ్లైసీమియా, కాలేయం పెద్దగా అవడం, కండరాల బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ మధుసూదన్ తెలిపారు. దీర్ఘకాలంలో గుండె, మెదడు, కండరాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందన్నారు. చిన్నారి అఫ్షన్‌కు అప్పటికే వ్యాధి ముదిరి, పరిస్థితి విషమంగా మారడంతో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. చిన్నారి తండ్రి నుంచి లివర్‌లోని కొంత భాగాన్ని సేకరించి, బాలుడికి అమర్చారు. డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగానికి చెందిన వైద్యుల బృందం సుమారు 14 గంటల పాటు ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి, బాబుకు పునర్జన్మను ప్రసాదించారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఇప్పటివరకు ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా కోలుకుంటున్నాడని డాక్టర్ మధుసూదన్ వెల్లడించారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సుమారు 50 లక్షల వరకూ చార్జ్ చేసే ఈ సర్జరీని, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ సహకారంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశామని ఉస్మానియా సూపరింటెండెంట్, డాక్టర్ రాకేశ్ సహాయ్ తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం అవసరమైన మందులను కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. దేశంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా అరుదుగా జరుగుతాయని, ముఖ్యంగా గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్ వంటి అరుదైన వ్యాధులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం వైద్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని డాక్టర్లు తెలిపారు. కేవలం 10 కిలోల బరువున్న చిన్నారికి అత్యంత అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడిన ఉస్మానియా డాక్టర్ల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న డాక్టర్ల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించారని మంత్రి కొనియాడారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్న వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షల మంది పేషెంట్లకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని మంత్రి గుర్తు చేశారు.

## జూన్ 16 వరకు జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డుల పొడిగింపు

**(మొదటి పేజీ తరువాయి)**

అభిప్రాయాన్ని కోర్టుకు తెలియజేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఒక నెలపాటు కార్డుల గడువు పొడిగించాలని నిర్ణయించిందని చెప్పారు. అయితే, అది సమ్మర్ సెలవులతో సరిపోతుందని గమనించిన కోర్టు, జర్నలిస్టులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు గడువును జూన్ 16 వరకు మరింతగా పొడిగించింది. ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డులు అన్నీ 2026 జూన్ 16 వరకు చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి కోర్టు సమయం ఇచ్చింది. ఈ నిర్ణయం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఉన్న అక్రెడిటేటెడ్ జర్నలిస్టులు అధికారిక కార్యక్రమాలకు అంతరాయం లేకుండా హాజరవుతారు. అలాగే అక్రిడిటేషన్‌కు సంబంధించిన అన్ని ప్రయోజనాలు కూడా కొనసాగుతాయి. దీంతో వారి వృత్తిపరమైన పనుల్లో ఎలాంటి ఆటంకం ఉండదు. ఇక ఫెడరేషన్ తరఫున ఒక ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్ కూడా దాఖలు చేశారు. అందులో, వచ్చిన దరఖాస్తుల సంఖ్య, జారీ చేసిన కార్డులు, తిరస్కరించిన దరఖాస్తులు మరియు వాటి కారణాల వివరాలను కోర్టు ముందు ఉంచాలని కోరారు. ఈ అంశాన్ని తదుపరి విచారణలో కోర్టు పరిశీలించనుంది. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ సయ్యద్ ఘౌస్ మొహియుద్దీన్ ఈ నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే, ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని పేర్కొన్నారు. శాశ్వత పరిష్కారం కోసం తమ న్యాయ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. కోర్టు తదుపరి విచారణను జూన్ 16, 2026కు వాయిదా వేసింది. ఆ విచారణలో ఈ ప్రభుత్వ ఆదేశాల భవిష్యత్తుపై తుది నిర్ణయం తీసుకోనుంది.



## క్రూడాయిల్ బ్యారెల్ 126 డాలర్లు

**(మొదటి పేజీ తరువాయి)**

ఇప్పుడు "సరఫరా పరిస్థితి వాస్తవికత" వైపు దృష్టి సారించారని మార్కెట్ పరిశీలకులు భావిస్తున్నారు. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడం, హోర్ముజ్ జలసంధి తెరవాలనే ఇరాన్ ప్రతిపాదనను ట్రంప్ తిరస్కరించినట్లు వార్తలు రావడంతో, చమురు ప్రవాహాలు త్వరగా పునరుద్ధరణ అవుతాయనే ఆశ మార్కెట్‌లో సన్నగిల్లుతోంది అని ఐఎన్జీ పెట్టుబడి బ్యాంకు వస్తువుల వ్యూహాల అధిపతి వారెన్ ప్యాటర్సన్ అన్నారు. కాగా, గురువారం మధ్యాహ్నానికి ధర 114 డాలర్లకు తగ్గింది. మార్చిలో యూఎస్ ద్రవ్యోల్బణం ఏడాదికి 3.3శాతానికి పెరిగింది. యుద్ధం కారణంగా బ్రిటన్‌కు 35 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం, 2026లో మాంద్యం ప్రమాదం ఉందని ఒక థింక్‌ట్యాంక్ అంచనా వేసింది. చమురు మార్కెట్ అతిపెద్ద సరఫరా సంక్షోభం ముగియకపోతే, ధరలు 2008లో రికార్డు స్థాయి 147 డాలర్లకు తిరిగి చేరవచ్చు.

## చల్లని చిరు జల్లులు!

**(మొదటి పేజీ తరువాయి)**

పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఏపీలోని దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. వర్షాలు పడే అవకాశం ఉన్నప్పటికీ కొన్నిచోట్ల వేడి, తేమతో కూడిన అసౌకర్య వాతావరణం కూడా కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. తెలంగాణ విషయానికి వస్తే.. హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా ప్రకారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే మూడు రోజులు అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అయితే గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో మాత్రం పెద్దగా మార్పు ఉండకపోవచ్చని, ఎండ తీవ్రత కొనసాగుతూనే మధ్యమధ్యలో వానలు పడతాయని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

# బట్టలు.. బుక్కులు

**(మొదటి పేజీ తరువాయి)**

పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ.. వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు



పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, టీజీబీసీడబ్ల్యూఆర్ఐఈఎస్ కార్యదర్శి బీ సైదులు తదితరులు పాల్గొన్నారు.



# బెంగాల్ గరం గరం

**(మొదటి పేజీ తరువాయి)**

భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని ఆమె ఆరోపించారు. "బీజేపీ చివరి అంకం ఆడింది. అసలు లెక్కలు విడుదల చేసి ఉంటే షేర్ మార్కెట్లు కుప్పకూలిపోయేవి. ప్రజలు ఐక్యంగా ఉండాలి, ఓట్ల లెక్కింపును నిశితంగా గమనించాలి... రాత్రంతా మేల్కొని ఉండాలి" అని దీదీ చెప్పారు. అంతేకాదు, అవసరమైతే ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద తానే స్వయంగా కాపలా ఉంటానని కూడా ఆమె తెలిపారు. "వారు ఈవీఎంలను మార్చేందుకు ప్లాన్ చేస్తున్నారు.... నేను పత్రికా సమావేశం నిర్వహించి, 'కౌంటింగ్ టేబుళ్లను వదిలి వెళ్లండి' అని ప్రకటించే వరకు మీరు కదలొద్దు... వారు కంప్యూటర్లలో డేటాను మార్చి, మన నెంబర్లు బీజేపీకి, బీజేపీ నెంబర్లను మనకు తారుమారు చేయొచ్చు.. నేనే స్వయంగా కౌంటింగ్ హాల్‌కు వెళ్తాను.. ఒక అభ్యర్థిగా నేను అది చేయగలను. మీరు ఇప్పటికే ఎంతో కష్టపడ్డారు.. బెంగాల్‌ను కాపాడటానికి దయచేసి మరికొంత భరించండి" అని మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. 'బెంగాల్‌లోని 294 అసెంబ్లీ స్థానాలకు గాను 226కు పైగా సీట్లు గెలిచి మేము తిరిగి అధికారంలోకి వస్తాం' అని బెంగాల్ ముఖ్యమంత్రి అన్నారు. ఇదిలా ఉండగా బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీల మధ్య హోరాహోరీ పోరు ఉందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. మూడు నాలుగు సర్వేలు బీజేపీకి.. మరో రెండు మూడు సర్వేలు టీఎంసీకి మొగ్గు ఉన్నట్టు తెలిపాయి. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీకి 125 నుంచి 140, బీజేపీకి 146 నుంచి 161 సీట్లు వస్తాయని అంచనా వేసింది. పోల్‌స్టర్ పీ- మార్క్ కూడా బీజేపీ 150 నుంచి 175, టీఎంసీ 118 నుంచి 138 స్థానాలను గెలుస్తుందని జోస్యం చెప్పింది. కానీ, పోల్స్ పోల్ డెయిరీ బీజేపీ స్పష్టమైన మెజార్టీ సాధిస్తుందని ఆ పార్టీకి 142 నుంచి 171, టీఎంసీ 99 నుంచి 127 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసింది. కానీ, పోల్‌స్టర్ పీపుల్స్ పల్స్ మాత్రం టీఎంసీ 177 నుంచి 187 సీట్లతో అధికారం నిలబెట్టుకుంటుందని, బీజేపీ 95 నుంచి 110 స్థానాల్లో గెలుస్తుందని పేర్కొంది.

# భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి

**(మొదటి పేజీ తరువాయి)**

ఆరంభంలో, శివధర్ రెడ్డి తన బాధ్యతలను శాంతిభద్రతల డీజీపీ మహేశ్ భగవత్ కు అప్పగించారు. నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించే వరకు, ఇంచార్జి డీజీపీగా మహేశ్ భగవత్ వ్యవహరించనున్నారు. అధికారిక బదిలీ ప్రక్రియ అనంతరం, వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన ఐపీఎస్ అధికారులు, సిబ్బంది కి చేతులు ఊపుతూ అభివాదం చేస్తూ తనను కలిసేందుకు వచ్చిన కరచాలనం చేస్తూ, ఆత్మీయంగా పలకరిస్తూ శివధర్ రెడ్డి ముందుకు సాగారు. అనంతరం పూలతో అలంకరించిన వాహనంపై నిలబడి, అందరికీ చేతులు ఊపుతూ అభివాదం చేశారు. పోలీసు సంప్రదాయంలో అత్యంత గౌరవప్రదమైన రీతిలో ఐపిఎస్ అధికారులు తాళ్లతో ఆ వాహనాన్ని తాగుతుండగా, ఇతర సిబ్బంది డీజీపీపై పూలు చల్లుతూ కార్యాలయ ప్రధాన ద్వారం వరకు సాగనంపారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ తమ ప్రియతమ అధికారికి వీడ్కోలు పలుకుతుంటే, ఆ ప్రాంగణం మొత్తం భావోద్వేగంతో నిండిపోయింది. టిజిసిఎస్బి డైరెక్టర్ శిఖా గోయల్,



జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, శాంతి భద్రతల డీజీపీ మహేష్ భగవత్, టీఎస్ఎల్పీఆర్బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు, ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ విజయకుమార్ లతో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆయనకు సాదర వీడ్కోలు పలికారు. చివరగా, ప్రధాన గేటు వద్దకు చేరుకున్న శివధర్ రెడ్డి అందరి కృతజ్ఞతలను స్వీకరిస్తూ తన వాహనంలో వెళ్లారు.

## తెలంగాణ రాష్ట్ర సేన కాదు.. తెలంగాణ రక్షణ సేన

**(మొదటి పేజీ తరువాయి)**

మేడ్చల్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో కవిత తన కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ సభలో పార్టీ పేరును 'తెలంగాణ రాష్ట్ర సేన'గా వెల్లడించారు. అయితే, ఇప్పుడు కేంద్ర ఎన్నికల సంఘం ఆ పేరుకు బదులుగా 'తెలంగాణ రక్షణ సేన' పేరుకు ఆమోదం తెలిపింది. ఈ పేరును కవితకు కేటాయిస్తున్నట్లు ధ్రువీకరిస్తూ ఎన్నికల సంఘం పంపిన లేఖతో, ఆమె పార్టీకి సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఒక కీలక ఘట్టం పూర్తయింది. ఈ అధికారిక ఆమోదంతో కవిత తన రాజకీయ కార్యకలాపాలను 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో ముందుకు తీసుకెళ్లనున్నారు.

## పాతాళానికి రూపాయి

**డాలర్‌తో రూ.95.20కు చేరిక**

ముంబై: దేశీయ కరెన్సీ రూపాయి గురువారం భారీ పతనాన్ని నమోదు చేసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తొలిసారిగా 95 మార్కును దాటి చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. అమెరికా, ఇరాన్ మధ్య తీవ్రమవుతున్న ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరగడం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన వైఖరి వంటి అంశాలు రూపాయిని తీవ్ర ఒత్తిడిలోకి నెట్టాయి. గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.07 వద్ద ఆల్-టైమ్ కనిష్టాన్ని తాకింది. ఆ తర్వాత మరింత బలహీనపడి ఇంట్రాడేలో 95.126 స్థాయికి, సెషన్ మధ్యలో 95.20 స్థాయికి కూడా పడిపోయింది. కేవలం ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు రూపాయి విలువ సుమారు 5.8 శాతం మేర క్షీణించడం గమనార్హం.

## బీసీ శాఖ సలహాదారుగా వీహెచ్

**(మొదటి పేజీ తరువాయి)**

కేటాయిస్తారు. ఒకవేళ స్వంత ఇల్లు లేదా అద్దె ఇంట్లో ఉంటే నెలకు రూ. 50 వేల చొప్పున ఇంటి అద్దె భత్యం చెల్లిస్తారు. సొంత కారు ఉపయోగిస్తే నెలకు రూ. 30 వేలు కన్వేయన్స్ అలవెన్స్, దాంతో పాటు రూ. 15 వేలు ఇంధన చార్జీలు అందుతాయి. అఖిల భారత సర్వీసు అధికారుల తరహాలోనే మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉంటుంది. సలహాదారు విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సిబ్బందిని సైతం కేటాయించింది. ఒక ప్రైవేట్ సెక్రటరీ, ఒక డీఈఓ, ఇద్దరు ఆఫీస్ సబార్డినేట్లు, ఒక డ్రైవర్‌తో పాటు నివాసంలో ల్యాండ్ లైన్ ఫోన్, మొబైల్ ఫోన్ సౌకర్యాన్ని కల్పించనున్నారు. బీసీల అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడం, సంక్షేమ పథకాల అమలును పర్యవేక్షించడంలో వీహెచ్ కీలక పాత్ర పోషించనున్నారు.

## మంగ్లీ సోదరుడి ఖాతాకు డబ్బులు!

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): గాయని మంగ్లీ ఆరోపణలు ఎదుర్కొంటున్న మైక్రో ఫైనాన్స్ కేసులో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగ్లీ సోదరుడు శివచౌహాన్ బ్యాంకు ఖాతాలను పోలీసులు పరిశీలించగా, మూడుసార్లు డబ్బులు వచ్చినట్లు గుర్తించారు. రమావత్ మధు బ్యాంకు ఖాతా నుంచి శివ అకౌంట్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు వచ్చాయని తెలిపారు. దీనితో రమావత్ మధు బ్యాంకు ఖాతాను పోలీసులు జప్తు చేశారు. మధు, హిమకాంత్ రెడ్డి, శివ చౌహాన్‌ల బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మైక్రో ఫైనాన్స్ పేరిట అధిక లాభాలు వస్తాయని నమ్మించి మంగ్లీ, ఆమె సోదరుడు, మరికొంతమంది కలిసి కోట్లాది రూపాయలు మోసం చేశారని సికింద్రాబాద్‌కు చెందిన న్యాయవాది సుబ్బారావు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై తాను మంగ్లీని సంప్రదించే ప్రయత్నం చేయగా ఆమె బెదిరింపులకు పాల్పడిందని చెబుతూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో మంగ్లీ, ఆమె సోదరుడితో పాటు మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు, తన పేరును ఉపయోగించుకుని సుబ్బారావు ప్రాచుర్యం పొందాలని చూస్తున్నారని ఆరోపిస్తూ మంగ్లీ కూడా ఫిర్యాదు చేశారు.

## ‘టీఆర్ఎస్’ నాకు రాసిపెట్టి ఉందేమో: కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ‘టీఆర్ఎస్ పార్టీ నాకు రాసి ఉందేమో’ అని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కవిత ప్రకటించిన రాజకీయ పార్టీ ‘టీఆర్ఎస్’కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. అయితే తెలంగాణ రాష్ట్ర సేనకు బదులు తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు ఆమెకు లేఖను అందజేశారు. ఈ నేపథ్యంలో, ‘టీఆర్ఎస్’కు ఆమోదం తెలపడంపై కవిత ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. తొలుత తాను సూచించిన తెలంగాణ రాష్ట్ర సేనకు బదులు తెలంగాణ రక్షణ సేనకు ఈసీ ఆమోదం తెలిపింది. అయితే రెండింటి సంక్షిప్త నామాలు ‘టీఆర్ఎస్’ కావడంతో కవిత హర్షం వ్యక్తం చేశారు. “తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని తెలంగాణ సమాజానికి తెలియజేస్తున్నాను. టీఆర్ఎస్‌కు ఆమోదం లభించడం సంతోషంగా ఉంది. రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం నేను చేసిన కృషిని కొనసాగిస్తూ, ఇక ముందు కూడా తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పనిచేస్తానని తెలియజేస్తున్నాను” అని కవిత పేర్కొన్నారు.

# నేటి నుంచి అక్రెడిటేషన్ల పంపిణీ

**మే 10 లోగా దరఖాస్తు చేసుకున్నోళ్లకు మంజూరు.. దేశానికే ఆదర్శంగా తెలంగాణలో అక్రెడిటేషన్ల జారీ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): రాష్ట్రంలో అర్హులైన ప్రతి జర్నలిస్ట్‌కు అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచన మేరకు పాత్రికేయులకు ఆరోగ్యంతోపాటు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గురువారం నాడు సమాచార శాఖ ఆధ్వర్యాన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంత్రిగారు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులను ఇంతవరకు పొడిగించామని, దేశంలో, ఇతర రాష్ట్రాలలో అమలు చేస్తున్న ఉత్తమ విధానాలను ఇక్కడ అనుసరించాలన్న ఆలోచన మేరకు పరిశీలన సాగిందని అందువల్లే ఈ కార్డుల జారీలో ఆలస్యం చోటుచేసుకుందన్నారు. గత ప్రభుత్వం 32,500 మందికి అక్రిడిటేషన్లు ఇచ్చే అవకాశం ఉన్నా 23,352 కే పరిమితం చేసిందన్నారు. తమ ప్రభుత్వం ఇప్పుడు సుమారు 46 వేల మందికి పైగా అక్రిడిటేషన్లు ఇచ్చేలా మార్పులు చేసిందని తెలిపారు. ఇప్పటికే సుమారు 2800 వరకు కార్డులను ఆమోదించడం జరిగిందని వివరించారు. జర్నలిస్టుల సూచనల మేరకు జీవోలలో మార్పులు చేర్పులు చేశామని, అర్హులైన జర్నలిస్టులకు కార్డుల మంజూరులో వెనకడుగు ప్రసక్తే లేదని అన్నారు. మే 1వ తేదీన అన్ని జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ చేయాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ ప్రక్రియలో మే 10 వతేదీని ఒక కటాఫ్ డేట్‌గా పెట్టుకొని దరఖాస్తులు చేసుకోవాలని, ఆ తేదీలోగా వచ్చే దరఖాస్తులను ఆమోదించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల సంఖ్య తేలితే జర్నలిస్టులకు ఆరోగ్యం ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకోవచ్చునని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఈ దిశగా పలు సూచనలు చేశారని వెల్లడించారు. అంతేగాక జర్నలిస్టులు వివిధ సంస్థలలో ఉద్యోగాలు మారినప్పటికీ అక్రిడిటేషన్ల మంజూరు ఓ నిరంతర ప్రక్రియగా సాగుతుందని ఈ విషయంలో ఎటువంటి సందేహాలు వద్దని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని త్వరలో పాత్రికేయ సంఘాలతో భేటీ అవుతామని తెలిపారు. ఏప్రిల్ 30తో కొంతమంది జర్నలిస్టుల బస్సుపాస్‌ల గడువు ముగుస్తున్నందున మరో 15 రోజుల పాటు పొడిగించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాసరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ ముకుందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మా వాటా వెంటనే విడుదల చేయండి

**తెలంగాణకు ఏపీ తెలుగు అకాడమీ డిమాండ్**



విజయవాడ, ఏప్రిల్ 30 (ఈవార్తలు): రాష్ట్ర విభజన జరిగి దశాబ్దం దాటినా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఆస్తుల పంపకాల వివాదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా తెలుగు అకాడమీకి సంబంధించిన నిధుల అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్ర విభజన ఒప్పందం ప్రకారం ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీకి రావాల్సిన వాటా నిధులను తెలంగాణ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్‌డీ విల్సన్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం వాటిని బేఖాతరు చేస్తోందని ఆయన ఆరోపించారు. నిధుల కొరత కారణంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీ కార్యకలాపాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని విల్సన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఇప్పటికే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు, సమగ్ర శిక్షా అధికారులకు లేఖలు రాసినట్లు గుర్తుచేశారు. మరోవైపు ఏపీ ఇంటర్మీడియట్ పాఠ్యపుస్తకాల ముద్రణకు సంబంధించి రావాల్సిన రూ.50 కోట్ల బకాయిలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. రాష్ట్ర విభజన తర్వాత తెలుగు అకాడమీ ఆస్తులు, డిపాజిట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 58:42 నిష్పత్తిలో పంపిణీ చేయాలని గతంలోనే ఒప్పందం కుదిరింది. దీనిపై సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకుని, ఏపీ వాటాను 6 శాతం వడ్డీతో సహా చెల్లించాలని 2021 హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ తెలంగాణ నుంచి స్పందన లేదని ఏపీ అకాడమీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా విల్సన్ ఏపీ ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు చేశారు. తమిళనాడు తరహాలో ఏపీలో వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, అకాడమీ భవనం కోసం ప్రభుత్వం భూమి కేటాయిస్తే రూ.15 కోట్లతో నిర్మిస్తామని తెలిపారు. తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్‌కు కేబినెట్ హోదా కల్పించాలని కోరారు. ప్రైవేట్ విద్యా సంస్థలు కూడా అకాడమీ పుస్తకాలను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని, అకాడమీలో ఖాళీగా ఉన్న 13 పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## నేటి నుంచి సనత్‌నగర్ టిమ్స్‌లో ట్రయల్ రన్

**నెల పాటు 22 విభాగాల్లో ఓపీ సేవలు.. అధికారులకు మంత్రి దామోదర్ ఆదేశం**

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): సనత్‌నగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్)ను ప్రారంభించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు.. శుక్రవారం నుంచి హాస్పిటల్‌లో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం నుంచి సుమారు నెల రోజుల పాటు ట్రయల్ రన్ కొనసాగనుంది. ట్రయల్ రన్‌లో భాగంగా రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అవుట్ పేషెంట్, డయాగ్నసిస్ సేవలు అందించనున్నారు. కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీతో పాటు మొత్తం 22 విభాగాల్లో ట్రయల్ రన్ జరగనుంది. ఇందుకోసం అవసరమైన డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని అధికారులు నియమించారు.

## బీఆర్ఎస్ నాయకుల ఫోన్లు హ్యాక్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): బీఆర్ఎస్ నాయకుల ఫోన్లను, ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కేటీఆర్, హరీశ్ రావులతో పాటు తమ పార్టీకి చెందిన సీనియర్ నాయకుల ఇళ్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు హ్యాకర్లను బెంగళూరు నుంచి తీసుకువచ్చి హ్యాక్ చేస్తున్నారని తమ వద్ద ఉన్న ఆధారాలతో సహా కేటీఆర్, హరీశ్ రావులు ప్రజల ముందు పెట్టారని అన్నారు. తమ పార్టీ నాయకులు చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం సిట్ వేయాలని అన్నారు. ఈ హ్యాకింగ్ వాస్తవమా, కాదా చెప్పాలని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు చేయని నేరాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిట్ వేస్తోందని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్, హరీశ్ రావులను ఇరికించే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. 2024 మార్చిలో ఒక పోలీసు అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసు ఇప్పటి వరకు ఒక ధారావాహిక వలె కొనసాగుతోందని అన్నారు. ఇప్పటి వరకు 350 మంది సాక్షులను విచారించినా ఛార్జ్‌షీట్ మాత్రం ఫైల్ చేయలేదని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి రెండుసార్లు సిట్ ఏర్పాటు చేశారని అన్నారు. ఇది కేవలం రాజకీయ కక్షతోనే చేస్తున్నారని ధ్వజమెత్తారు. సాంకేతిక ఆధారాలతో సరైన సాక్ష్యాలతో విచారణ జరపాల్సిన కేసులో కావాలని కొంతమంది పాత నేరస్థులతో రాజకీయ నాయకుల పేర్లను చెప్పాలని ఒత్తిడి చేసి తప్పుడు ఆధారాలు సేకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ అంశంలో గత ఎవరైనా తప్పు చేస్తే, చట్టబద్ధంగా విచారణ జరపాలి తప్ప లేని ఆధారాలు సృష్టించి, తప్పుడు సాక్ష్యాలు చూపి రాజకీయ నాయకులను ఇరికించాలని చూడటం సరైంది కాదని అన్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## బీఆర్ఎస్ చచ్చిన పాము: డాక్టర్ కె. లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమం సమయంలో బీఆర్ఎస్‌తో కలిసి పనిచేశామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ ఒక చచ్చిపోయిన పాములాంటిదని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని జోస్యం చెప్పారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ప్రతిపక్ష హోదా కల్పిస్తే, కేసీఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. ప్రభుత్వంతో బీఆర్ఎస్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకుందని ఆరోపించారు. బీజేపీ అజేయశక్తిగా ఎదుగుతోందని, కానీ ఆ పార్టీలు దొడ్డిదారిన అడ్డుకునే కుట్రలు చేస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్‌తో కలిసి ఉద్యమంలో పనిచేశామని అన్నారు.






## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు):జగిత్యాల మండలం బాలపల్లి గ్రామానికి చెందిన బేతి భూమారెడ్డి దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్ ఇంటిని ప్రారంభించి, దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చీరను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు కట్ట రాజేందర్, సర్పంచులు గుంటి రవి, బొడ్డు దామోదర్, నాయకులు బొక్కల గంగారెడ్డి, కడ మహేష్, బి. చిరంజీవి, బోయ గంగాధర్, గుంటి గంగమల్లయ్య, చెట్టే మల్లేష్, మేడపట్ల సురేష్, గణేష్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా సత్య ప్రణవ్



జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా కే సత్య ప్రణవ్‌ను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న స్పందనను బదిలీ చేశారు. ఇటీవల జగిత్యాల మున్సిపాలిటీలో జరిగిన అవకతవకలపై ఏసీబీ, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి పలు అంశాలను గుర్తించినట్లు సమాచారం. ఆస్తి పన్నుల వసూళ్లలో అలసత్వం, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వంటి ఆరోపణల నేపథ్యంలో స్పందన బదిలీ జరిగినట్లు తెలిసింది.




## మహిళల భద్రతపై భరోసా, షీటీం అవగాహన

జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని వివిధ కాలనీలలో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది మహిళలు, పిల్లలు వేధింపులకు గురైనప్పుడు వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. మహిళా హక్కులు, భద్రతకు సంబంధించిన చట్టాలు, పోక్సో చట్టంపై వివరించారు. లింగ సమానత్వం ప్రాముఖ్యతను తెలియజేసి, సమాజంలో ప్రతి ఒక్కరిని గౌరవంగా చూడాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 నంబర్ కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ వినియోగం, మద్యపానం, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## వడదెబ్బతో రైతు మృతి

వెల్గటూర్, ఏప్రిల్ 30 (ఈవార్తలు): వెల్గటూర్ మండలంలోని సూరారం గ్రామంలో వడదెబ్బకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జాడీ లచ్చయ్య (62) వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లి పంట కోయిస్తుండగా వడదెబ్బ తగిలి స్పృహ కోల్పోయి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఇంటికి తరలించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య జాడీ రాజమ్మ ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తదుపరి అంత్యక్రియల కోసం బంధువులకు అప్పగించారు.

## నవరాత్రి వేడుకల్లో అడ్లూరి

ధర్మపురి, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ధర్మపురి లో గురువారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా, అలాగే స్వామివారి జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం ఆలయ పురోహితులు మంత్రివర్యులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.



## హెడ్ కానిస్టేబుల్ అశోక్‌రావుకు ఘన వీడ్కోలు

జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): పోలీస్ శాఖలో 34 సంవత్సరాల పాటు సేవలు అందించిన హెడ్ కానిస్టేబుల్ అశోక్‌రావుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ప్రస్తుతం గొల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. పోలీస్ శాఖలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, రిటైర్మెంట్ అనంతరం కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

జగిత్యాల ఏప్రిల్ 30 (ఈవార్తలు) : జగిత్యాల పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం బ్రహ్మోత్సవ వేడుకల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి అనంతరం శ్రీ లక్ష్మీనరసింహ జయంతి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా విశేష సంఖ్యలో భక్తులు నవగ్రహ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు అలాగే సంతాన గోపాల హోమ పూజా కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాలను అందజేసి ఆశీర్వాసనాన్ని అందజేశారు విచ్చేసిన భక్తులకు అన్నవరపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రముఖ జ్యోతిష్య వాస్తు పౌరాణిక వేద పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక, నంబి రాంగోపాలాచార్య, నంబి సత్యనారాయణ ఆచార్య, నంబి మధుసూదన్ ఆచార్య, నంబి నృసింహ ఆచార్యులు భక్తులు ప్రముఖులు పాల్గొన్నారు.



## మహిళలకు 50శాతం రిజర్వేషన్ లక్ష్యం: నందయ్య

జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): చట్టసభల్లో మహిళలకు 50 శాతం వాటా సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ "శక్తి అభియాన్" కార్యక్రమాన్ని ప్రారంభించిందని డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తెలిపారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళల భాగస్వామ్యం లేని ప్రజాస్వామ్యం అసంపూర్ణమని పేర్కొన్నారు. ఇన్నాళ్లు రాజకీయ పార్టీలు మహిళలను ఓటు బ్యాంకుగానే చూసాయని, ఇకపై కాంగ్రెస్ పార్టీ వారిని నిర్ణయాధికారంతో ఉన్న నాయకులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ సాధించడమే ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యమని, ఇది కేవలం నినాదం కాకుండా కార్యాచరణతో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని మహిళలు, యువతులు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ కృష్ణవేణి, సీనియర్ నేత సి.ఎస్. శివలాల్ నేతికర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలా?

**కేంద్రియ విద్యాలయానికి స్థల కేటాయింపులో ఆలస్యమేల?**

**మే 15లోగా మంత్రి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలి**

**లేకపోతే జగిత్యాలలో ఎంపీ అర్వింద్ నిరాహార దీక్ష**

**బీజేపీ రాష్ట్ర నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణి హెచ్చరిక**



జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): కేంద్రియ విద్యాలయానికి స్థలం కేటాయింపులో ఆలస్యం స్వలాభాల కోసమే జరుగుతోందా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ భోగ శ్రావణి ప్రవీణ్ ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గురువారం జగిత్యాల ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసినప్పటికీ, ఇప్పటివరకు స్థలం కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. నిజామాబాద్ ఎంపీ అరవింద్ ధర్మపురి విజ్ఞప్తితో కేంద్రం విద్యాలయాన్ని మంజూరు చేసిందని, కానీ స్థానిక నాయకుల నిర్లక్ష్యంతో ప్రక్రియ ముందుకు సాగలేదని ఆరోపించారు. వనపర్తిలో ఇప్పటికే స్థలం కేటాయించడంతో వచ్చే ఏడాది తరగతులు ప్రారంభం కానున్నాయని గుర్తుచేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి ప్రాంతాల విద్యార్థులకు ఈ విద్యాలయం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. జిల్లా మంత్రి అల్లూరి లక్ష్మణ్ కుమార్ జోక్యం చేసుకుని తక్షణమే స్థలం కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మే 15లోపు స్థలం కేటాయించకపోతే, ఎంపీ అరవింద్‌తో కలిసి నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు కాళేశ్వరం వరప్రదాయిని

**మేడిగడ్డ మరమ్మతులపై సీఎం స్పందన ఎక్కడ?**

**రాజకీయాలు ఆపకపోతే ప్రజలే తీర్పు ఇస్తారు**

**బీఆర్ఎస్ ప్రధాని కార్యదర్శి జీవన్ రెడ్డి హెచ్చరిక**



జగిత్యాల, ఏప్రిల్ 30 (ఈవార్తలు): కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయినిగా నిలిచిందని, సీఎం రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కొత్త కుట్రలకు తెరతీస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ . జీవన్ రెడ్డి ఆరోపించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 148 మీటర్ల ఎత్తుతో తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్రతో ఒప్పందం కుదుర్చుకుందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం 150 మీటర్ల ఎత్తు అంశాన్ని ప్రస్తావించడం ద్వారా సీఎం తన వైఫల్యాలను దాచిపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వంతో ఉన్న సంబంధాలను వినియోగించి తుమ్మడిహెట్టి బ్యారేజ్ ఎత్తు పెంపు కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫోర్త్ సిటీపై ఉన్న శ్రద్ధ ప్రాణహిత జలాల వినియోగంపై లేదని మండిపడ్డారు. మేడిగడ్డ మరమ్మతులకు ఎల్‌అండ్‌టీ సంస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని, మాజీ సీఎం కే చంద్రశేఖర్ రావు కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తితే దానికి సీఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనమని, రాష్ట్రానికి సాగు, తాగునీటి అవసరాల కోసం నిర్మించారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తుమ్మడిహెట్టి పనులు ప్రారంభించి, మేడిగడ్డ పునర్నిర్మాణంపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాల కన్నా అమరావతికే ప్రాధాన్యమా?: షర్మిల

విజయవాడ, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ఏపీలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ఇంధన కొరతతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం బడా కాంట్రాక్టర్ల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తోందని ఆమె ఆరోపించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ.. "డీజిల్ కోసం రైతులు, పెట్రోల్ కోసం సాధారణ ప్రజలు గంటల తరబడి క్యూలలో పడిగాపులు కాస్తున్నారు. ఇలాంటి అత్యవసర స్థితిలో ప్రజా అవసరాలపై దృష్టి సారించాల్సిన ప్రభుత్వం, కాంట్రాక్టర్ల గురించి మాట్లాడటం ఏంటి?" అని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ల కోసమే ప్రత్యేకంగా డీజిల్ సరఫరా చేయాలని కోరడం ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తోందన్నారు. "రైతు కన్నా కాంట్రాక్టర్ ముఖ్యమా? ప్రజల కష్టాల కన్నా అమరావతి పనులే ప్రాధాన్యమా? ఇది పాలన కాదు.. పూర్తిగా ప్రాధాన్యతల వైఫల్యం" అని షర్మిల దుయ్యబట్టారు. ముందుగా రైతులకు, సాధారణ ప్రజలకు నిరంతర ఇంధన సరఫరా జరిగేలా చూడాలని, ఆ తర్వాతే కాంట్రాక్టర్ల గురించి ఆలోచించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజల కష్టాలను పట్టించుకోకుండా కాంట్రాక్టర్లకే ప్రాధాన్యమిస్తే, ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని షర్మిల హెచ్చరించారు.

## పూడి శ్రీహరికి కుప్పం కోర్టు బెయిల్

కుప్పం, ఏప్రిల్ 30 (ఈవార్తలు): మాజీ సీఎం జగన్ సీపీఆర్వో, వైసీపీ నేత పూడి శ్రీహరికి కుప్పం కోర్టులో ఊరట లభించింది. బెంగళూరులో అరెస్ట్ అయిన ఆయనను పోలీసులు ఈ రోజు ఉదయం కుప్పం మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆయనకు బెయిల్ మంజూరు చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... ముఖ్యమంత్రి చంద్రబాబుకి సంబంధించిన మార్ఫింగ్ ఫోటోలు, అసభ్యకర పోస్టుల వ్యవహారంలో శ్రీహరిపై కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుడు వినోద్ కుమార్ మూర్తి ఇచ్చిన ఫిర్యాదుతో ప్రారంభమైన ఈ కేసులో, గత కొన్ని రోజులుగా హైకోర్టు, సుప్రీంకోర్టుల చుట్టూ తిరిగిన వివాదం చివరకు కుప్పం కోర్టులో బెయిల్‌తో ముగిసింది. పోలీసుల కస్టడీ అభ్యర్థనను తోసిపుచ్చుతూ, ఆయనకు బెయిల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. దీంతో, బెంగళూరులో ఉన్న శ్రీహరిని పోలీసులు అరెస్ట్ చేశారు. కుప్పంకోర్టులో ఆయనను ప్రవేశపెట్టగా బెయిల్ మంజూరు చేసింది. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టేవారిపై ఉక్కుపాదం మోపుతామని కూటమి ప్రభుత్వం ఇటీవల సీరియస్ వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగిస్తున్నారని అధికార పక్షం ఆరోపిస్తుంటే... ఇదంతా రాజకీయ కక్షసాధింపు చర్యలని విపక్షం వాదిస్తోంది.

## ఈపీఎస్-95 కనీస పెన్షన్ 7,500!

**ఏటీఎంల ద్వారా పీఎఫ్ విత్ డ్రా**

న్యూఢిల్లీ: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) చందాదారులకు త్వరలో కీలకమైన శుభవార్తలు అందనున్నాయి. ఉద్యోగుల కనీస పెన్షన్‌ను భారీగా పెంచడంతో పాటు ఏటీఎంల ద్వారా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పించడంపై ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ దృష్టి సారించాయి. ఈ మార్పులు అమలైతే కోట్లాది మంది ఉద్యోగులు, కార్మికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్-95) కింద ఇస్తున్న కనీస పెన్షన్ రూ.1,000గా ఉంది. దీనిని ఏకంగా రూ.7,500కు పెంచాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. కార్మిక సంఘాల నుంచి వస్తున్న ఒత్తిడి, పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇదే సమయంలో చందాదారుల ఖాతాలకు 8.25 శాతం వడ్డీ రేటును జమ చేసే ప్రతిపాదన ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. చందాదారులకు మరింత ఊరటనిచ్చేలా, ఏటీఎంల ద్వారా నేరుగా పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేసుకునే సౌకర్యంపై ఈపీఎఫ్ఓ కసరత్తు చేస్తోంది. ఇది అమలైతే, అత్యవసర సమయాల్లో డబ్బు డ్రా చేసుకోవడం మరింత సులభం, వేగవంతం కానుంది. మరోవైపు క్లెయిమ్స్ పరిష్కారంలో ఈపీఎఫ్ఓ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 8.31 కోట్ల క్లెయిమ్స్‌ను పరిష్కరించింది. అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 6.01 కోట్లుగా ఉంది. ఇందులో 5.51 కోట్లు అడ్వాన్స్ లేదా పాక్షిక విత్ డ్రాయల్ క్లెయిమ్స్ కావడం గమనార్హం. ఆటోమేషన్, డిజిటల్ ప్రక్రియల ద్వారా క్లెయిమ్స్ పరిష్కార వేగాన్ని ఈపీఎఫ్ఓ గణనీయంగా మెరుగుపరిచింది. సుమారు 71.11 శాతం అడ్వాన్స్ క్లెయిమ్స్‌ను కేవలం మూడు రోజుల్లోనే పరిష్కరించింది. ఇటీవల ఈపీఎఫ్ఓ 'ఈ-ప్రాప్తి' అనే కొత్త పోర్టల్‌ను కూడా ప్రారంభించింది.

## సిందూర్ నిలిపివేత సొంత నిర్ణయమే

**కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ నిలిపివేతపై కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను భారత్ తన సొంత నిర్ణయం మేరకే నిలిపివేసిందని ఆయన అన్నారు. కానీ అవసరమైతే సుదీర్ఘ యుద్ధానికి కూడా తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఏఎన్ఐ నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ నిలిపివేత వ్యూహాత్మక నిర్ణయమేనని అన్నారు. కానీ సామర్థ్యం లేక నిలిపివేయలేదని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ మన సాయుధ దళాల సమైక్యతకు ఒక ఉదాహరణ అన్నారు. మన త్రివిధ దళాలు సమన్వయంతో ముందుకు వెళ్లాయని ప్రశంసించారు.



## గూడూరులో 45.8 డిగ్రీలు

**ఈ సీజన్ లో ఇదే రికార్డ్!**

**ఏపీ 216 మండలాల్లో 41 డిగ్రీలు**

గూడూరు, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఎండలు మండిపోతున్నాయి. నెల్లూరు జిల్లా గూడూరులో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం అక్కడ ఏకంగా 45.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ సీజన్‌లో రాష్ట్రంలో ఇదే అత్యధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా 216 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. రేపు పార్వతీపురం మన్యం, పోలవరం జిల్లాల్లోని 9 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఆయన తెలిపారు. మరోవైపు, ద్రోణి ప్రభావంతో కొన్ని జిల్లాల్లో అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వివరించారు. రేపు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడొచ్చని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వర్షం పడే సమయంలో చెట్ల కింద ఆశ్రయం పొందవద్దని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు తీవ్రమైన ఎండలు, మరోవైపు పిడుగులతో కూడిన వర్షాల హెచ్చరికలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు.

## కాకాణికి షాక్.. పిటిషన్లు కొట్టివేత

నెల్లూరు, ఏప్రిల్ 30 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దీర్ఘకాలంగా సంచలనం సృష్టిస్తున్న 'కోర్టు ఫైళ్ల చోరీ', ఫోర్జరీ ఆరోపణల కేసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. నెల్లూరులోని 4వ అదనపు జిల్లా కోర్టు ఆయన అభ్యర్థనలను తోసిపుచ్చుతూ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు నుంచి తన పేరును తొలగించాలని (డిశ్చార్జ్ పిటిషన్), అలాగే ఈ కేసును ప్రజాప్రతినిధుల కోర్టుకు బదిలీ చేయవద్దని కాకాణి కోరగా, న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. ఆయన అభ్యర్థనలను తోసిపుచ్చింది. కేసు వివరాల్లోకి వెళితే... గతంలో టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిపై ఫోర్జరీ పత్రాలతో ఆరోపణలు చేశారన్నదే ఈ కేసు ప్రధానాంశం. అయితే, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసును విచారిస్తున్న కోర్టు ప్రాంగణం నుంచే కీలకమైన పత్రాలు, సాక్ష్యాలు చోరీకి గురవ్వడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఉదంతంపై అప్పట్లో హైకోర్టు కూడా తీవ్రంగా స్పందించి సీబీఐ విచారణకు ఆదేశించింది. తాజాగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూడా స్పందిస్తూ, ఈ కేసు విచారణను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని కోరారు.

# నేటి నుంచి కీలక మార్పులివే..

న్యూఢిల్లీ: శుక్రవారం (మే 1) నుంచి కొత్త నెల ప్రారంభం కాబోతోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా సామాన్యుడి దైనందిన జీవితం, ఆర్థిక లావాదేవీలపై ప్రత్యక్ష ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరల నుంచి క్రెడిట్ కార్డు చార్జీల వరకు, ఆన్‌లైన్ గేమింగ్ నియంత్రణల వరకు అనేక రంగాల్లో కొత్త నిబంధనలు అమలు కానున్నాయి.



**ఎల్‌పీజీ సిలిండర్:**

**ధర, బుకింగ్, డెలివరీలో మార్పులు**

ప్రతి నెలా మొదటి తేదీన చమురు మార్కెటింగ్ సంస్థలు గ్యాస్ సిలిండర్ ధరలను సవరిస్తాయి. ఈ క్రమంలో మే 1న గృహ, వాణిజ్య అవసరాలకు వినియోగించే ఎల్‌పీజీ సిలిండర్ల ధరల్లో మార్పులు ఉండే అవకాశం ఉంది. దీని ప్రభావం సాధారణ కుటుంబాల నుంచి హోటళ్లు, రెస్టారెంట్ల వరకు అందరిపైనా పడుతుంది.

**గ్యాస్ బుకింగ్ లో కూడా కొత్త నిబంధనలు**

ఇకపై గ్యాస్ బుకింగ్ విషయంలో కూడా కొత్త నిబంధనలు రానున్నాయి. ఒకసారి సిలిండర్ బుక్ చేశాక, మళ్లీ బుక్ చేయడానికి పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల నిరీక్షణ కాలాన్ని తప్పనిసరి చేసే అవకాశం ఉంది. దీంతోపాటు డెలివరీ ప్రక్రియలో భద్రతను పెంచేందుకు డెలివరీ అథెంటికేషన్ కోడ్ (డీఏసీ) విధానాన్ని తప్పనిసరి చేస్తున్నారు. ఇకపై సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుడు తమ ఫోన్‌కు వచ్చిన ఓటీపీని డెలివరీ ఏజెంట్‌కు చెప్పాల్సి ఉంటుంది. అలాగే, ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) లబ్ధిదారులు సబ్సిడీ ప్రయోజనాలు కొనసాగాలంటే, ఆధార్ ఆధారిత ఈ-కేవైసీని తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలి. లేనిపక్షంలో సబ్సిడీ నిలిచిపోయే ప్రమాదం ఉంది.

**ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు చార్జీలలో మార్పులు**

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ రేపటి నుంచి తమ క్రెడిట్ కార్డు నిబంధనలను సవరిస్తోంది. బ్యాంకు అధికారిక వెబ్‌సైట్ ప్రకారం లేట్ పేమెంట్ ఫీజులు, వార్షిక ఫీజు మినహాయింపు షరతుల్లో మార్పులు చేసింది. రూ. 100 నుంచి రూ. 500 మధ్య బకాయిలపై లేట్ పేమెంట్ చార్జి రూ. 100, రూ. 500 నుంచి రూ. 1,000 మధ్య బకాయిలపై రూ. 500 వరకు వసూలు చేయనున్నారు. కొన్ని కార్డులపై గతంలో ఏడాదికి రూ. 50,000 ఖర్చు చేస్తే లభించే వార్షిక ఫీజు మినహాయింపు పొందాలంటే, ఇకపై రూ. 1 లక్ష వరకు ఖర్చు చేయాల్సి రావచ్చు.

**సీఎన్‌జీ-పీఎన్‌జీ ధరల సవరణ**

ఎల్‌పీజీ మాదిరిగానే కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) ధరలను కూడా నెల మొదటి రోజున సవరిస్తారు. ఈ ధరల పెంపు రవాణా ఖర్చులతో పాటు గృహ బడ్జెట్‌లపై కూడా ప్రభావం చూపుతుంది.



**ఆన్‌లైన్ గేమింగ్‌పై కఠిన నిబంధనలు**

'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్-2025' కింద రూపొందించిన 'ఆన్‌లైన్ గేమింగ్ రూల్స్ 2026' మే 1 నుంచి అమల్లోకి రావచ్చు. ఈ నిబంధనలను పర్యవేక్షించేందుకు 'ఆన్‌లైన్ గేమింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఓజీఏఐ)' అనే కొత్త నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ చట్టం ప్రకారం గేములను మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు. అవి: ఆన్‌లైన్ మనీ గేమ్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్. వయోపరిమితులు, తల్లిదండ్రుల నియంత్రణ (పేరెంటల్ కంట్రోల్స్), ఆర్థిక లావాదేవీలపై నిఘా వంటి కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయనున్నారు. ఈ నిబంధనలు దేశీయ, విదేశీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు వర్తిస్తాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఈ మార్పులు పారదర్శకతను పెంచి, వినియోగదారులకు మెరుగైన రక్షణ కల్పించేందుకు ఉద్దేశించినవి. కొన్ని నిబంధనలు మొదట్లో కొంత అసౌకర్యంగా అనిపించినా, దీర్ఘకాలంలో వ్యవస్థలను మరింత సురక్షితంగా, సమర్థవంతంగా మారుస్తాయని భావిస్తున్నారు.

## అణు కార్యక్రమాలు వదిలేస్తేనే డీల్

**ఇరాన్‌కు ట్రంప్ డెడ్‌లైన్**

వాషింగ్టన్: ఇరాన్‌తో అణు ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వైఖరిని మరింత కఠినతరం చేశారు. ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని పూర్తిగా వదిలిపెడితే తప్ప ఎలాంటి ఒప్పందమూ ఉండబోదని స్పష్టం చేశారు. అప్పటివరకు చర్చల ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఇరాన్‌పై ప్రస్తుతం కొనసాగుతున్న అమెరికా నావికా దిగ్బంధనాన్ని ఆయన 'జీనియస్', '100 శాతం ఫూల్‌ప్రూఫ్' అని అభివర్ణించారు. అమెరికా నౌకాదళం సత్తాకు ఇది నిదర్శనమని అన్నారు. "ఈ దిగ్బంధనం బాంబు దాడుల కన్నా ప్రభావవంతమైనది. వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు" అని ఆక్సియోస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో చర్చలు ప్రస్తుతం నేరుగా కాకుండా 'టెలిఫోనిక్‌గా' జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రతిష్టంభనపై ఆయన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. మరోవైపు, అమెరికా వైఖరిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దిగ్బంధనాన్ని కొనసాగిస్తే 'అపూర్వమైన సైనిక చర్య' తప్పదని హెచ్చరించింది. దౌత్యానికి అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇప్పటివరకు సంయమనం పాటిస్తున్నామని పేర్కొంది.

## అమెరికా పద్ధతి మార్చుకుంటేనే చర్చలు

**ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్పష్టీకరణ**

**అభద్రతకు అమెరికా, ఇజ్రాయెలే కారణమని ఆరోపణ**

టెహ్రాన్: అమెరికా తన వైఖరి మార్చుకుంటే, దౌత్యమార్గంలో చర్చలు జరపడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పష్టం చేశారు. రెచ్చగొట్టే చర్యలు, మితిమీరిన విధానాలకు వాషింగ్టన్ స్వస్తి పలికితేనే దౌత్య ప్రక్రియను ముందుకు తీసుకెళతామని ఆయన గురువారం తెలిపారు. జపాన్ ప్రధాని సనాయే టకాయిచీతో ఫోన్‌లో మాట్లాడిన పెజెష్కియాన్, గల్ఫ్ మరియు హార్మూజ్ జలసంధిలో ప్రస్తుత అభద్రతకు అమెరికా, ఇజ్రాయెల్ చర్యలే కారణమని ఆరోపించారు. ఇరాన్ నౌకలపై అమెరికన్ సముద్రపు దొంగతనాన్ని ఆపాలని, దానిని అందరూ ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సంభాషణలో భాగంగా హార్మూజ్ జలసంధిలో చిక్కుకున్న జపాన్ నౌక, సిబ్బందిని విడిచిపెట్టడంపై ఇరువురు నేతలు చర్చించారు. ముగ్గురు జపాన్ సిబ్బందితో ఉన్న తమ నౌకను సురక్షితంగా పంపడాన్ని సానుకూల పరిణామంగా భావిస్తున్నట్లు టకాయిచీ పేర్కొన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు త్వరగా పునఃప్రారంభమై తుది ఒప్పందం కుదరాలని ఆమె ఆకాంక్షించారు. హోర్ముజ్ జలసంధిలో అన్ని దేశాల నౌకలకు స్వేచ్ఛాయుత, సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలని ఆమె గట్టిగా కోరారు. కాగా, పర్షియన్ గల్ఫ్ నేషన్ డే సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ, సముద్ర మార్గాలపై దిగ్బంధనం విధించడం అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇది ప్రపంచ శాంతికి ముప్పు అని అన్నారు. పాకిస్థాన్‌లో విఫలమైన చర్చల అనంతరం అమెరికా హోర్ముజ్ జలసంధిపై దిగ్బంధనం విధించిన విషయం తెలిసిందే.

## హర్మూజ్‌లో కొత్త అధ్యాయం: మొజ్తబా

**లిఖిత పూర్వక ప్రకటన విడుదల**

టెహ్రాన్: అమెరికా అవమానకర వైఫల్యంతో హర్మూజ్ జలసంధిలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి గల్ఫ్, హర్మూజ్ జలసంధి విషయంలో కొత్త అధ్యాయం రూపుదిద్దుకుంటోందని అన్నారు. ఈ మేరకు ఆయన లిఖిత పూర్వక ప్రకటన విడుదల చేశారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా దిగ్బంధనం కొనసాగుతున్నప్పటికీ, ఇరాన్ తన అణు, క్షిపణి సామర్థ్యాలను పరిరక్షించుకుంటుందని సుప్రీం లీడర్ తెలిపారు. పర్షియన్ గల్ఫ్‌లో అమెరికన్ల ఏకైక స్థానం, ఆ సముద్ర జలాల అడుగున మాత్రమే ఉంటుందని ఎద్దేవా చేశారు. కాగా, ఈ జలసంధి వద్ద కొత్త నియమ నిబంధనలను అమలుచేస్తారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మొజ్తబా వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. అంతకుముందు, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా అమెరికాకు కౌంటర్ ఇచ్చారు. ఇరాన్ ఓడ రేవులపై అమెరికా దిగ్బంధనం గల్ఫ్‌లో చమురు అంతరాయాలను మరింత తీవ్రతరం చేస్తుందని అన్నారు. తద్వారా అమెరికా తన లక్ష్యాలను సాధించడంలో విఫలం కావడం తథ్యమని పేర్కొన్నారు. సముద్ర దిగ్బంధం లేదా ఆంక్షల విధింపు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు.

## నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం... 17 మంది మృతి

ఖట్మండు: నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోల్పా జిల్లాలోని పర్వత ప్రాంతంలో ఒక జీపు అదుపుతప్పి 700 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న వారిలో పదిహేడు మంది మృతి చెందారు. స్థానికులు జల్‌జలాలో జరిగే వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వర్షం కారణంగా బురద ఏర్పడి వాహనం జారిపడిందని పోలీసులు తెలిపారు.

# అమెరికాతో పాక్ డబుల్ గేమ్?

**ఇరాన్‌కు అండగా కీలక నిర్ణయం!**

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరు దేశాల మధ్య శాంతి కోసం మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్థాన్ తీసుకున్న ఒక నిర్ణయం అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇరాన్‌తో వాణిజ్యం కోసం తమ భూభాగం మీదుగా ఆరు మార్గాలను తెరుస్తున్నట్లు పాక్ అధికారికంగా ప్రకటించింది. ఈ చర్య, ఇరాన్‌పై అమెరికా అమలు చేస్తున్న కఠిన ఆర్థిక ఆంక్షలను నీరుగార్చడమేనని, పాకిస్థాన్ "డబుల్ గేమ్" ఆడుతూ అమెరికాకు వెన్నుపోటు పొడిచిందని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హర్మూజ్ జలసంధి మీదుగా ఇరాన్ సముద్ర వాణిజ్యాన్ని దిగ్బంధించి, ఆ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయాలన్నది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యూహం. దీనిని "గరిష్ఠ ఆర్థిక ఒత్తిడి" విధానంగా ఆయన అభివర్ణిస్తున్నారు. అయితే, పాకిస్థాన్ తాజా నిర్ణయంతో ఇరాన్ తన వాణిజ్యాన్ని, ముఖ్యంగా రష్యా, చైనాలతో లావాదేవీలను ఈ భూమార్గాలు ద్వారా నిరాటంకంగా కొనసాగించే అవకాశం లభించింది. దీంతో ట్రంప్ వ్యూహానికి పెద్ద గండి పడినట్లయింది. ఈ పరిణామంపై అమెరికా జాతీయ భద్రతా నిపుణుడు డెరెక్ జె గ్రాస్‌మన్ తీవ్రంగా స్పందించారు. "ట్రంప్ ప్రభుత్వానికి ఇది



కొత్త సమస్య. మీకు మిత్రుడైన పాకిస్థాన్, ఇరాన్‌కు ఆరు భూమార్గాలను తెరవడం హర్మూజ్ జలసంధిలో మీరు ఏర్పాటు చేసిన దిగ్బంధనాన్ని బలహీనపరిచింది. అమెరికా ఒత్తిడిని తట్టుకోవడానికి ఇది ఇరాన్‌కు సహాయపడుతుంది. ఇస్లామాబాద్ మరోసారి అమెరికాతో డబుల్ గేమ్ ఆడింది" అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. డాన్ పత్రిక కథనం ప్రకారం ఇప్పటికే పాక్ ఓడరేవుల్లో ఇరాన్ వెళ్లాల్సిన సుమారు 3,000 కార్గో కంటైనర్లు నిలిచిపోయాయి. తాజా నిర్ణయంతో అవన్నీ ఈ భూమార్గాల ద్వారా ఇరాన్‌కు చేరనున్నాయి. కేవలం అమెరికా మాత్రమే కాదు, పాకిస్థాన్ మధ్యవర్తిత్వ పాత్రపై ఇతర దేశాలు కూడా సందేహాలు వ్యక్తం చేస్తున్నాయి. పాకిస్థాన్ నమ్మదగిన మధ్యవర్తి కాదని భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజార్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఆసక్తికరంగా పాకిస్థాన్ సహాయం పొందుతున్న ఇరాన్ కూడా దాని నిష్పాక్షికతను శంకించడం గమనార్హం. పాక్ తమకు మంచి మిత్రుడే అయినప్పటికీ, అది అమెరికా ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని, అందువల్ల సరైన మధ్యవర్తి కాదని ఇరాన్ జాతీయ భద్రతా కమిషన్ ప్రతినిధి ఇబ్రహీం రెజాయీ పేర్కొన్నారు. ఈ పరిణామాలతో పాకిస్థాన్ దౌత్యపరమైన విశ్వసనీయత ప్రశ్నార్థకంగా మారింది.

# 70 కోట్లు దాటిన ఫోన్‌పే యూజర్లు

న్యూఢిల్లీ: భారత డిజిటల్ పేమెంట్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న ఫోన్‌పే సరికొత్త చరిత్ర సృష్టించింది. నిన్నటితో తమ ప్లాట్‌ఫామ్‌పై రిజిస్టర్డ్ యూజర్ల సంఖ్య 70 కోట్లు (700 మిలియన్లు) దాటినట్లు ఇవాళ అధికారికంగా ప్రకటించింది. దేశ జనాభాలో ఇంత భారీ స్థాయిలో యూజర్లను కలిగి ఉండటం, డిజిటల్ చెల్లింపులు, ఆర్థిక సేవల పంపిణీలో ఫోన్‌పే ఎంతగా విస్తరించిందో తెలియజేస్తోంది. ఫోన్‌పే వృద్ధి ప్రయాణంలో సాధించిన వేగం అత్యంత ఆసక్తికరంగా ఉంది. సంస్థ ప్రారంభమైనప్పుడు మొదటి 10 లక్షల మంది వినియోగదారులను చేరడానికి 136 రోజులు పట్టింది. కానీ, ప్రస్తుతం కేవలం 6 రోజుల్లోనే 10 లక్షల మంది కొత్త యూజర్లు తమ ప్లాట్‌ఫామ్‌లో చేరుతున్నారని కంపెనీ తెలిపింది. 2023 ఆర్థిక సంవత్సరం నుంచి 2025 ఆర్థిక సంవత్సరం వరకు, ఫోన్‌పే 56.25 శాతం స్థిరమైన వార్షిక వృద్ధి రేటును




(జూా+=) నమోదు చేసింది. ఇది కంపెనీ ఎంత వేగంగా, స్థిరంగా విస్తరిస్తుందో స్పష్టం చేస్తోంది. వినియోగదారుల నమ్మకం, మార్కెట్-లీడింగ్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్, సులభమైన, సురక్షితమైన డిజిటల్ చెల్లింపుల అనుభవాన్ని అందించడంపై దృష్టి పెట్టడమే ఈ వృద్ధికి ప్రధాన కారణమని కంపెనీ పేర్కొంది. ఈ మైలురాయిపై ఫోన్‌పే వ్యవస్థాపకుడు, సీఈవో సమీర్ నిగమ్ మాట్లాడుతూ... "70 కోట్ల రిజిస్టర్డ్ యూజర్ల మార్కును దాటడం మా ప్రయాణంలో ఒక ముఖ్యమైన ఘట్టం. దేశవ్యాప్తంగా వినియోగదారులు మాపై ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనం. నేటి ఆధునిక జీవితంలో డిజిటల్ చెల్లింపుల ప్రాముఖ్యత ఎంతగా పెరిగిందో మా వృద్ధి వేగమే తెలియజేస్తోంది. భవిష్యత్తులో కూడా అందరికీ సులభమైన, సురక్షితమైన, అందుబాటులో ఉండే ఉత్పత్తులను రూపొందించడంపై మా దృష్టి ఉంటుంది. భారతదేశ డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు మా వంతు సహకారం అందిస్తూనే ఉంటాం" అని వివరించారు. భారతదేశంలో డిజిటల్ వ్యవస్థ స్వీకరణ పెరుగుతున్న నేపథ్యంలో తమ సేవలను మరింత విస్తరించాలని, భారతీయుల కోసం మరిన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణంలో పెట్టుబడులు పెట్టాలని ఫోన్‌పే లక్ష్యంగా పెట్టుకుంది.

## 2,300 మంది అమెరికా సైనికుల డేటా లీక్!

**అమెరికాకు ఇరాన్ హ్యాకర్ల షాక్**

టెహ్రాన్: ఇరాన్‌తో సంబంధాలున్న ఓ హ్యాకర్ల బృందం అమెరికాకు గట్టి షాక్ ఇచ్చింది. పర్షియన్ గల్ఫ్‌లో మోహరించిన 2,379 మంది అమెరికా మెరైన్స్ వ్యక్తిగత వివరాలను లీక్ చేసినట్లు 'హండాలా' అనే సైబర్ గ్రూప్ ప్రకటించింది. తమ టెలిగ్రామ్ ఛానెల్‌లో సైనికుల పేర్లు, ఇతర వివరాలను మంగళవారం విడుదల చేసినట్లు తెలిపింది. తమ నిఘా సామర్థ్యాలను చాటుకునేందుకే ఈ లీక్‌కు పాల్పడినట్లు హ్యాకర్లు పేర్కొన్నారని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. అంతటితో ఆగకుండా ఆ సైనికుల వాట్సాప్‌కు "మేం మిమ్మల్ని గమనిస్తున్నాం, మిమ్మల్ని లక్ష్యంగా చేసుకోవచ్చు" అంటూ బెదిరింపు సందేశాలు పంపినట్లు ఇరాక్‌కు చెందిన షఫాక్ న్యూస్ రిపోర్ట్ చేసింది. సైనికుల కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి చిరునామాలు, వారి దినచర్యలు, కదలికల సమాచారం కూడా తమ వద్ద ఉందని హ్యాకర్ల బృందం హెచ్చరించింది. ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ పెంటగాన్ తీవ్రంగా స్పందించింది. సైనికుల వివరాలు బహిర్గతం కావడం భద్రతకు పెను ముప్పు అని భావిస్తూ ఈ సైబర్ దాడిపై ఉన్నత స్థాయి దర్యాప్తు ప్రారంభించింది. డేటా ఎలా చోరీకి గురైందనే దానిపై అధికారులు దృష్టి సారించారు. ఇదే హండాలా గ్రూప్ గత నెలలో ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వ్యక్తిగత ఈ-మెయిల్‌ను హ్యాక్ చేసినట్లు ప్రకటించుకోవడం గమనార్హం. ప్రస్తుతం అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ సైబర్ దాడి జరగడం ప్రాధాన్యంను సంతరించుకుంది. ఈ ఘటనతో అంతర్జాతీయ ఘర్షణల్లో సైబర్ దాడులు ఎంత కీలక పాత్ర పోషిస్తున్నాయో మరోసారి స్పష్టమైంది.

## పవన్ ఖేరా తీర్పు రిజర్వ్

న్యూఢిల్లీ: అసోం ముఖ్యమంత్రి భార్య రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా చేసిన ఆరోపణలకు సంబంధించి కేసు నమోదైన విషయం తెలిసిందే. పవన్ ఖేరా ముందస్తు బెయిల్ పిటిషన్ కోసం దరఖాస్తు చేసుకోగా, సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. తనకు పలు పాస్‌పోర్టులు ఉన్నాయని, విదేశీ ఆస్తులు ఉన్నాయంటూ కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలపై రిణికి భూయాన్ శర్మ గౌహతిలో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా అభ్యర్థించగా, గౌహతి హైకోర్టు తిరస్కరించింది. దీంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పవన్ ఖేరా తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపించారు. ఈ కేసు విచారణ కోసం పవన్ ఖేరాను కస్టడీలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని సింఘ్వీ కోర్టుకు తెలిపారు. నిర్బంధ విచారణతో అవమానించాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. ఇది పరువు నష్టానికి సంబంధించిన అంశమని తెలిపారు. ఈ కేసులో అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ తాను చట్టాలకు అతీతమన్న రీతిలో స్పందించారని, పవన్ ఖేరాపై నమోదైన కేసుకు సంబంధించి పలు సెక్షన్ల కింద బెయిల్ పొందే అవకాశం ఉందని, మరికొన్ని సెక్షన్ల కింద అసలు అరెస్టు చేయాల్సిన అవసరమే లేదని అన్నారు. అసోం పోలీసుల తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

## భారత్‌కు 657 కళాఖండాలు అప్పగించిన అమెరికా

న్యూయార్క్: అక్రమంగా తరలించిన భారత పురాతన సంపద తిరిగి స్వదేశానికి చేరుకుంది. అమెరికాలోని మాన్‌హట్టన్ డిస్ట్రిక్ట్ అటార్నీ (డీఏ) కార్యాలయం సుమారు 14 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 116 కోట్లు) విలువైన 657 పురాతన కళాఖండాలను భారత్‌కు అప్పగించింది. న్యూయార్క్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మాన్‌హట్టన్ డీఏ ఆల్విన్ ఎల్ బ్రాగ్ జూనియర్, ఈ కళాఖండాలను భారత కాన్సులేట్ అధికారులకు లాంఛనంగా అందజేశారు. అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్‌లపై సుదీర్ఘకాలంగా జరుపుతున్న దర్యాప్తులో భాగంగా ఈ పురాతన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు డీఏ కార్యాలయం తెలిపింది. ముఖ్యంగా, అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఆరోపణలు ఎదుర్కొంటున్న సుభాష్ కపూర్, ఇప్పటికే దోషిగా తేలిన నాన్సీ వీనర్‌తో సంబంధం ఉన్న నెట్‌వర్క్‌ల నుంచి వీటిని రికవరీ చేశారు. భారత్‌లోని వివిధ ప్రాంతాల నుంచి, ముఖ్యంగా మధ్యప్రదేశ్ ఆలయాలు, ఛత్తీస్‌గఢ్ మ్యూజియంల నుంచి ఈ కళాఖండాలను దొంగిలించి, అక్రమంగా అమెరికాకు తరలించినట్లు అధికారులు గుర్తించారు. తిరిగి అప్పగించిన వాటిలో 2 మిలియన్ డాలర్ల విలువైన 'కాంస్య అవలోకితేశ్వర' విగ్రహం, 7.5 మిలియన్ డాలర్ల విలువైన 'ఎర్ర ఇసుకరాయి బుద్ధుడి' విగ్రహం వంటి అత్యంత విలువైనవి ఉన్నాయి. "భారతదేశ సాంస్కృతిక సంపదను లక్ష్యంగా చేసుకుని భారీ స్థాయిలో స్మగ్లింగ్ జరిగింది. మరిన్ని వస్తువులను తిరిగి అప్పగించేందుకు మా బృందాలు నిరంతరం కృషి చేస్తున్నాయి," అని డీఏ ఆల్విన్ బ్రాగ్ పేర్కొన్నారు. ఈ సహకారానికి భారత కాన్సుల్ జనరల్ బినయ ప్రధాన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సుభాష్ కపూర్‌ను 2022లో భారత్‌లో దోషిగా నిర్ధారించారు. అతడిని విచారణ నిమిత్తం అమెరికాకు అప్పగించే ప్రక్రియ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

## ఐప్యాక్ సహ వ్యవస్థాపకుడు వినేశ్‌కు బెయిల్

న్యూఢిల్లీ: రాజకీయ, ఎన్నికల వ్యూహాల సంస్థ ఐ-ప్యాక్ సహ వ్యవస్థాపకుడు వినేశ్ చందల్‌కు ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టులో ఊరట లభించింది. పశ్చిమ బెంగాల్‌లో సంచలనం సృష్టించిన బొగ్గు కుంభకోణం కేసులో తలెత్తిన మనీలాండరింగ్ ఆరోపణల కేసులో ఆయనకు కోర్టు ఉపశమనాన్ని కల్పించింది. వినేశ్ చందల్‌కు అదనపు సెషన్స్ జడ్జి అమిత్ బన్సాల్ బెయిల్ మంజూరు చేశారు. విచారణలో ఆయన సహకరించారని ఈడీ పేర్కొనడంతో, బెయిల్ ఇచ్చేందుకు కోర్టు మొగ్గు చూపింది. వినేశ్ చందల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. 2 లక్షల వ్యక్తిగత పూచీకత్తు, ష్యూరిటీ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లకూడదని, సాక్ష్యాలను ధ్వంసం చేయరాదని, భవిష్యత్తులో జరిగే దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని కోర్టు షరతులు విధించింది. నేషనల్ లా ఇన్‌స్టిట్యూట్ యూనివర్శిటీ గ్రాడ్యుయేట్ అయిన వినేశ్ చందల్‌కు ఐ-ప్యాక్‌లో 33 శాతం వాటా ఉంది. ఈ సంస్థ గతంలో పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో మమతా బెనర్జీ విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

ఒయ్యారి చిత్రం




జారా యెస్మీన్




## మే 21నే దృశ్యం తెలుగు వెర్షన్ కూడా!

మాలీవుడ్ నుంచి రిలీజై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన ఫ్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది దృశ్యం. జీతూ జోసెఫ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంచైజీ క్రైం థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కగా.. సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలతో ప్రేక్షకులను సీట్లకు కట్టిపడేస్తుంది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీలోమరోసారి దృశ్యం 3 కూడా వస్తుందని తెలిసిందే. దృశ్యం ఫస్ట్ పార్ట్ థియేటర్‌లో విడుదలవగా.. రెండో పార్టు ఓటీటీలో విడుదలైంది. రెండు పార్టులను తెరకెక్కించిన ఆశీర్వాద్ సినిమాస్ దశ్యం 3ని కూడా తెరకెక్కిస్తోంది. మలయాళంలో మోహన్ లాల్ , మీనా కాంబోలో వస్తోన్న దృశ్యం 3 మే 21న గ్రాండ్‌గా విడుదల కానుంది. తెలుగులో వెంకటేశ్, మీనా కాంబోలో రావాల్సిన దృశ్యం 3 సినిమా వెంకీ బిజీ షెడ్యూల్స్ వల్ల తెరకెక్కించడం లేదని ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే వెంకీ దృశ్యం 3 కోసం ఎదురుచూస్తున్న మూవీ లవర్స్‌కు నిరాశ మిగిలింది. వారి కోసం డైరెక్టర్ జీతూ జోసెఫ్ గుడ్‌న్యూస్ అందించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో చిట్‌చాట్ సెషన్‌లో దృశ్యం 3 మలయాళ వెర్షన్‌తోపాటు మే 21నే తెలుగు, తమిళం, కన్నడ డబ్బింగ్ వెర్షన్లు కూడా విడుదలవుతాయని చెప్పాడు. మొత్తానికి తెలుగు రీమేక్ లేకున్నా డబ్‌డ్ వెర్షన్ వస్తుండటంతో కొంత రిలీఫ్ అవుతున్నారు మూవీ లవర్స్. కాగా హిందీలో అజయ్ దేవ్‌గన్, శ్రియా కాంబోలో దృశ్యం 3 కూడా తెరకెక్కుతుండగా.. ఈ మూవీని 2026 అక్టోబర్ 2న రిలీజ్ చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్. అంటే ఒరిజినల్ (మలయాళం) వెర్షన్ రిలీజైన 6 నెలల తర్వాత హిందీలో రాబోతుందన్నమాట.

## పెద్దిలో చెర్రీ మరో షేడ్




మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం పెద్ది. ఈ మూవీ గురించి వస్తున్న కొత్త అప్డేట్లు సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా రూపొందిస్తున్న ఈ సినిమా విడుదల తేదీ కోసం అభిమానులు ఎదురుచూస్తుండగా, ఇదే సమయంలో ఓ కొత్త పోస్టర్‌కు సంబంధించిన టాక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే ఈ సినిమాలో రామ్ చరణ్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఒకవైపు క్రికెటర్‌గా, మరోవైపు కుస్తీ ఫైటర్‌గా ఆయన పాత్రలు ఉండనున్నాయని ముందే వెల్లడైంది. ఈ రెండు లుక్స్ అభిమానులకి మంచి కిక్ ఇచ్చిన వేళ, ఇప్పుడు మూడో స్పోర్ట్‌కు సంబంధించిన షేడ్ కూడా ఉండొచ్చన్న ప్రచారం మొదలైంది. ఈ కొత్త షేడ్‌కు సంబంధించిన పోస్టర్ త్వరలో విడుదల కానుందని, అందులో చరణ్ మరింత భిన్నమైన లుక్‌లో కనిపించనున్నారని టాక్ వినిపిస్తోంది. అయితే ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందో అనే విషయంపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక స్పష్టత రాలేదు. ఇదిలా ఉండగా, ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అలాగే జగపతి బాబు, శివ రాజ్‌కుమార్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ అందిస్తుండటం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

## మాఫియా నెట్‌వర్క్‌పై దూత2 దండయాత్ర




ఓటిటి ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్2 పై ఆసక్తి మరింతగా పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సాగుతూ సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా మెడికల్ మాఫియా వంటి సెన్సిటివ్, రేర్‌గా టచ్ చేసే అంశాన్ని ఎంచుకోవడం ద్వారా మేకర్స్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌కు సిద్ధమవుతున్నట్టు సంకేతాలు ఇస్తున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో రియలిస్టిక్, ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు ఉన్న డిమాండ్ దృష్ట్యా, ఈ జానర్ షిఫ్ట్ సిరీస్‌కు కీలకమైన మలుపుగా మారే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ఉన్న ప్రధాన బలం డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. ఆయన గతంలో కూడా థ్రిల్లర్ నెరేషన్‌లో తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. సీజన్1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని అవినీతి, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా, షాకింగ్ ఎలిమెంట్స్‌తో చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. ఇది కేవలం కథలో మార్పు మాత్రమే కాదు, ప్రేక్షకులకు మరింత లోతైన, అసహజంగా అనిపించే వాస్తవాలను చూపించే ప్రయత్నంగా కూడా భావించవచ్చు. ఇలాంటి డార్క్ కంటెంట్ ప్రస్తుతం ఓటీటీలో బలంగా ట్రెండ్ అవుతుండగా, దూత2 అదే వేవ్‌ను క్యాష్ చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

## ఘనంగా బెల్లంకొండ సాయి పెళ్లి







టాలీవుడ్ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ఓ ఇంటివాడయ్యాడు. తన ప్రేయసి కావ్య రెడ్డితో కలిసి బుధవారం రాత్రి ఏడడుగులు వేశాడు. తిరుమలలోని వేంకటేశ్వర స్వామి సాక్షిగా అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకతో బెల్లంకొండ తన వైవాహిక జీవితాన్ని ఘనంగా ప్రారంభించాడు. సినిమా ఆర్భాటాలకు దూరంగా, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా తిరుమల శ్రీవారి సన్నిధిలో బెల్లంకొండ శ్రీనివాస్, కావ్య రెడ్డిల వివాహం జరిగింది. బుధవారం రాత్రి నిర్ణయించిన ముహూర్తానికే (11: 05గంటలు) వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కావ్య మెడలో శ్రీనివాస్ మూడుముళ్లు వేశాడు. ఈ వేడుకలో రెండు కుటుంబాల సభ్యులతో పాటు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇక తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సాక్షిగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన బెల్లంకొండ సాయి శ్రీనివాస్, పెళ్లి తర్వాత దంపతులుగా స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఆస్తి వివాదంలో కరిష్మా కపూర్‌కు ఊరట



బాలీవుడ్ నటి కరిష్మా కపూర్‌కు భారీ ఊరట దక్కింది. వ్యాపారవేత్త సంజయ్ కపూర్ ఆస్తుల వీలునామా వివాదం నేపథ్యంలో గురువారం ఢిల్లీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. సంజయ్ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు మూడో భార్య ప్రియా సచ్‌దేవ్ కపూర్ ప్రయత్నిస్తున్నట్లు కర్మిషా పిల్లలు కేసు వేశారు. సంజయ్ కపూర్ రెండో భార్య కరిష్మా కపూర్. అయితే కర్మిషాకు విడాకులు ఇచ్చిన తర్వాత ప్రియా సచ్‌దేవ్‌ను సంజయ్ కపూర్ పెళ్లి చేసుకున్నారు. సంజయ్ గత ఏడాది లండన్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన విషయం తెలిసిందే. సుమారు 30 వేల కోట్ల ఖరీదైన ఆస్తులను సంరక్షించాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. సంజయ్ కపూర్ రాసిన వీలునామాపై అనుమానాలు ఉన్నట్లు ఆయన తల్లి రాణి కపూర్‌తో పాటు కరిష్మా కపూర్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆ అనుమానాలను తొలగించే బాధ్యత ప్రియా కపూర్‌పై ఉన్నట్లు జస్టిస్ జ్యోతి సింగ్ తన తీర్పులో పేర్కొన్నారు. వీలునామా చెల్లుబాటు అంశంపై విచారణ సాగుతున్న నేపథ్యంలో, ఈ కేసులో మరింత సమయం పడుతుందని, అయితే ఈ సమయంలో సంజయ్ కపూర్ ఆస్తులను సంరక్షించాలని కోర్టు పేర్కొన్నది.

## పల్లెటూరి కష్టజీవి.. అనుపమ




టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు.





ఐపీఎల్ 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ మరో అద్భుత విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. గురువారం నాడు నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న గుజరాత్, తొలుత ఆర్సీబీని కట్టడి చేసి, ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ దుమ్మురేపింది. ఆర్సీబీ నిర్దేశించిన 158 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.5 ఓవర్లలోనే 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. మరో 25 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకోవడం గుజరాత్ ఆధిపత్యానికి నిదర్శనం.

# ఆర్సీబీకి టైటాన్స్ షాక్

### సొంతగడ్డపై గుజరాత్ జోరు
### 25 బంతులు మిగిలుండగానే చేజ్

లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ ఇన్నింగ్స్‌ను వేగంగా ప్రారంభించారు. అయితే, సుదర్శన్ (6) త్వరగానే వెనుదిరిగినా, కెప్టెన్ గిల్ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 18 బంతుల్లో 4 ఫోర్లు, 3 భారీ సిక్సర్లతో 43 పరుగులు చేసి ఆర్సీబీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అతనికి జోస్ బట్లర్ (19 బంతుల్లో 39; 2 ఫోర్లు, 4 సిక్సర్లు) కూడా తోడవడంతో గుజరాత్ స్కోరు దూసుకెళ్లింది. వీరిద్దరి ధాటికి పవర్-ప్లే ముగిసేసరికి గుజరాత్ వికెట్ నష్టానికి 69 పరుగులు చేసింది. ఈ దశలో ఆర్సీబీ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అద్భుతం చేశాడు. తన అనుభవన్నంతా ఉపయోగించి కీలకమైన గిల్, బట్లర్, సుదర్శన్‌ల వికెట్లను పడగొట్టి మ్యాచ్‌ను మలుపు తిప్పే ప్రయత్నం చేశాడు. దీంతో గుజరాత్ 92 పరుగులకే 3 వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత రొమారియో షెపర్డ్ కూడా షారుఖ్ ఖాన్ (8), వాషింగ్టన్ సుందర్ (12) వికెట్లను తీయడంతో ఆర్సీబీ శిబిరంలో ఆశలు చిగురించాయి. అయితే, 'ఫినిషర్' రాహుల్ తెవాటియా (17 బంతుల్లో 27 నాటౌట్) మరోసారి తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించాడు. కీలక సమయంలో క్రీజులో నిలబడి, ఒత్తిడిని జయిస్తూ జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతనికి జాసన్ హోల్డర్ (12), రషీద్ ఖాన్ (7 నాటౌట్) నుంచి సహకారం లభించింది. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4 ఓవర్లలో 28 పరుగులిచ్చి 3 వికెట్లతో రాణించగా, రొమారియో షెపర్డ్ 2 వికెట్లు పడగొట్టాడు. జోష్ హేజిల్‌వుడ్ 4 ఓవర్లలో ఏకంగా 56 పరుగులు సమర్పించుకోవడం ఆర్సీబీ కొంపముంచింది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.



**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 8 | 6 | 1 | 13 |
| బెంగళూరు | 8 | 6 | 3 | 12 |
| హైదరాబాద్ | 9 | 6 | 3 | 12 |
| రాజస్థాన్ | 9 | 6 | 3 | 12 |
| గుజరాత్ | 9 | 5 | 4 | 10 |
| చెన్నై | 8 | 3 | 5 | 6 |
| ఢిల్లీ | 8 | 3 | 5 | 6 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 8 | 2 | 6 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |


ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు



## 'ఇంపాక్ట్' కాని శార్దూల్ ఠాకూర్

ముంబై ఇండియన్స్ జట్టు యాజమాన్యం, కెప్టెన్ హార్దిక్ పాండ్యా తీసుకుంటున్న కొన్ని వింత నిర్ణయాలు అభిమానులను అయోమయంలో పడేస్తున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్‌ను 'ఇంపాక్ట్ ప్లేయర్'గా బరిలోకి దించిన ముంబై ఇండియన్స్.. ఆ తర్వాత అతడిని ఏంటో తెలియక నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఈ మ్యాచ్‌లో ముంబైలోని వాంఖడే స్టేడియం మరోసారి పరుగుల వరదకు వేదికైంది. టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన చేశారు. ముఖ్యంగా ఓపెనర్ ర్యాన్ రికెల్టన్(123) అజేయ సెంచరీ సాధించి.. జట్టుకు 243 పరుగుల భారీ స్కోరును అందించాడు. ఇంత భారీ స్కోరు సాధించిన తర్వాత ముంబై విజయం ఖాయమని అందరూ భావించారు. అయితే ఆ స్కోరును కాపాడుకోవడంలో ముంబై బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఆరంభం నుంచే ముంబై బౌలర్లను చీల్చి ఉతికారేశారు. స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా 54 పరుగులు సమర్పించుకోవడంతో ముంబై ఆత్మరక్షణలో పడింది. ఇలాంటి క్లిష్ట సమయంలో రాబిన్ మింజ్ స్థానంలో వచ్చిన ఇంపాక్ట్ ప్లేయర్ శార్దూల్ ఠాకూర్ ఆపద్బాంధవుడిగా మారుతాడని అంతా ఆశించారు. కానీ హార్దిక్ పాండ్యా మాత్రం శార్దూల్ ఠాకూర్‌కు ఒక్క ఓవర్ బౌలింగ్ చేసే అవకాశం కూడా ఇవ్వలేదు. కళ్లముందే బౌలర్లు భారీగా పరుగులు ఇస్తున్నా.. స్టార్ బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను కేవలం ఫీల్డింగ్‌కే పరిమితం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. దీంతో ఐపీఎల్ చరిత్రలోనే శార్దూల్ ఠాకూర్ అత్యంత నిరుపయోగమైన ఇంపాక్ట్ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడని క్రికెట్ విశ్లేషకులు ఎద్దేవా చేస్తున్నారు.





## ఎంగిడి వచ్చేస్తున్నాడు

పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ (ఏప్రిల్ 25న) సందర్భంగా ఫీల్డింగ్ చేస్తూ దిల్లీ క్యాపిటల్స్ ఫాస్ట్‌బౌలర్ లుంగి ఎంగిడి తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతను కోలుకుని ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటున్నాడు. త్వరలో ఎంగిడి తిరిగి జట్టులోకి వస్తాడని తెలియజేస్తూ అతను బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను దిల్లీ క్యాపిటల్స్ సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. మే 1న జైపుర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో దిల్లీ తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఎంగిడి అందుబాటులో ఉండే అవకాశం లేదు. కంకషన్‌కు గురైన ఏ ఆటగాడినైనా వారం రోజులపాటు తప్పనిసరిగా ఆటకు దూరంగా ఉంచాలని ఐసీసీ నిబంధనలు చెబుతున్నాయి. ఐపీఎల్‌లో ఈ నియమం గురించి స్పష్టంగా ప్రస్తావించకపోయినప్పటికీ ఎంగిడి విషయంలో ఐసీసీ మార్గదర్శకాలనే పాటించే అవకాశాలున్నట్లు సమాచారం. పంజాబ్‌తో మ్యాచ్‌లో ఎంగిడి క్యాచ్ పట్టే ప్రయత్నంలో అతడు పడ్డ తీరు, ఆ తర్వాత కదలలేకపోయిన తీరు అందరినీ తీవ్ర ఆందోళనకు గురి చేసింది. అంబులెన్స్‌లో ఎంగిడిని ఆస్పత్రికి తీసుకెళ్లాల్సివచ్చింది. పంజాబ్ ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య కొట్టిన బంతి గాల్లోకి లేవగా బంతి దిశను ఎంగిడి తప్పుగా అంచనా వేశాడు. వెనక్కి అడుగులేస్తూ బంతిని అందుకునే ప్రయత్నం చేశాడు. క్యాచ్ అందలేదు కానీ అతడు అదుపు తప్పి వెనక్కి పడ్డాడు. ఆ క్రమంలో తల మైదానానికి బలంగా తగిలింది. మెడ కూడా ఒత్తిడికి గురైంది. తీవ్రమైన నొప్పితో విలవిల్లాడిన అతడు.. మళ్లీ లేవలేకపోయాడు. వెంటనే వైద్య సిబ్బంది స్ట్రెచర్‌తో మైదానంలోకి వచ్చారు. చాలా సేపు అతణ్ని కదపకుండా అలాగే ఉంచారు. ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం స్ట్రెచర్‌తోనే అంబులెన్స్‌లోకి ఎక్కించి ఆస్పత్రికి తరలించారు. ఎంగిడికి ఎలాంటి ప్రమాదం లేదని, అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని తర్వాత ఐపీఎల్ నిర్వాహకులు చెప్పడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అదే రాత్రే ఎంగిడిని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు.

## రియాన్ పరాగ్‌కు 25 శాతం ఫైన్



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు ఫైన్ పడింది. మ్యాచ్ ఫీజులో అతనికి 25 శాతం కోత విధించారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సమయంలో.. రియాన్ పరాగ్ డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ-సిగరేట్ తాగాడు. ఆ ఘటనకు చెందిన వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఎలక్ట్రానిక్ డివైస్‌తో పొగ పీల్చుతున్నట్లు కనిపించిన ఘటన పట్ల సోషల్ మీడియలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆ ఘటనపై ఐపీఎల్ స్పందించింది. మ్యాచ్ ఫీజులో 25 శాతం ఫైన్ విధిస్తున్నట్లు ఐపీఎల్ తన ప్రకటనలో చెప్పింది. పరాగ్ స్మోకింగ్ చేసిన విషయంపై ఆన్ ఫీల్డ్ అంపైర్లు తన్మే శ్రీవాత్సవ్, నితిన్ మీనన్ మ్యాచ్ రిఫరీ అమిత్ శర్మకు ఫిర్యాదు చేయలేదు. విజువల్స్ చూసిన తర్వాత వాళ్లు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత పరాగ్ క్రమశిక్షణా ఉల్లంఘనకు పాల్పడినట్లు శర్మ తెలిపారు. లెవల్1 అఫెన్స్ ప్రకారం మ్యాచ్ ఫీజులు 25 శాతం ఫైన్ విధించారు. ఓ డీమెరిట్ పాయింట్ కూడా పరాగ్ ఖాతాలో పడింది. తప్పుచేసినట్లు రియాన్ అంగీకరించాడు. మ్యాచ్ రిఫరీ విధించిన ఫైన్‌ను ఆమోదించినట్లు ఐపీఎల్ ఓ ప్రకటనలో చెప్పింది.

## భారత టెన్నిస్‌లో జెన్సీ సంచలనం

భారత టెన్నిస్‌లో కొత్త తార దూసుకొచ్చింది. మహిళల సింగిల్స్‌లో టెన్నిస్‌లో జెన్సీ కనబర్ చరిత్రాత్మక విజయం సాధించింది. ఢిల్లీలో జరుగుతున్న అంతర్జాతీయ మహిళల టెన్నిస్‌లో దుమ్మురేపిన జెన్సీ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా ప్రొఫెషన్ టెన్నిస్‌లో క్వార్టర్ ఫైనల్ చేరిన అతి చిన్న వయస్కురాలిలైన భారతీయురాలిగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించింది. 14 ఏళ్ల 5 నెలల వయసులోనే ఈ ఘనత సొంతం చేసుకున్న జెన్సీ లెజెండ్ సానియా మిర్జా రికార్డును అధిగమించింది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం సానియా మిర్జా ఐటీఎఫ్‌డబ్ల్యూలో క్వార్టర్ ఫైనల్ చేరి రికార్డు నెలకొల్పింది. అప్పటి నుంచి ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు అమె పేరిటే ఉంది. ఇన్నేళ్లుగా చెక్కుచెదరని సానియా రికార్డును జెన్సీ బద్దలు కొట్టింది. రెండో అంతర్జాతీయ టోర్నమెంట్‌లోనే సత్తా చాటిన తను... 16వ రౌండ్‌లో సందీప్తి సింగ్ రావును 6-3, 7-5తో ఓడించి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

## బుమ్రా కూడా మనిషే

పేలవ ఫామ్‌తో సతమతమవుతున్న ముంబై ఇండియన్స్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఆ జట్టు మేనేజ్‌మెంట్ అండగా నిలిచింది. బుమ్రా కూడా మనిషేనని, ఫామ్ కోల్పోవడం సహజమేనని ముంబై ఇండియన్స్ బౌలింగ్ కోచ్ కీరన్ పోలార్డ్ అన్నాడు. అతనికి ముంబై ఇండియన్స్ అండగా ఉంటుందని స్పష్టం చేశాడు.'ఏ ఆటగాడైనా సరైన ప్రదర్శన చేయలేకపోతే.. వెంటనే ప్రతి చిన్న విషయాన్ని నిశితంగా పరిశీలిస్తుంటాం. సదరు ఆటగాడు ఎందుకు ఆడలేకపోతున్నాడనే దానిపై చర్చలు పెడుతుంటాం. ఇలాంటి వాటి నుంచి జస్‌ప్రీత్ బుమ్రా మినహాయింపేమీ కాదు. గత కొన్నేళ్లుగా అతను ఎలాంటి ప్రదర్శన కనబర్చాడో మనం చూశాం. బుమ్రా కూడా మనిషే కదా.. అతను కూడా తప్పులు చేస్తాడు. కాలం కలిసి రానప్పుడు గతంలో చేసిన మంచిని గుర్తు చేసుకోవాలి. బుమ్రా తన స్థాయికి తగ్గట్లు రాణించ లేకపోయాడు. అయినా.. ఇప్పటికీ అతను వరల్డ్ నంబర్‌వన్ బౌలర్. అలానే మా ముంబై ఇండియన్స్‌కు కీలక బౌలర్. ఈ సీజన్‌లో మా జట్టు ఆశించిన స్థాయిలో ఆడలేకపోతుంది. మా ఫలితాలే అందుకు నిదర్శనం. జట్టుగా మేం ఇంకాస్త మెరుగైన ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. మ్యాచ్ గెలవాలంటే ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం చెలాయించాలి. అలా జరగకపోతే గెలవడం కష్టం. విజయం కోసం పోరాడాలనే పట్టుదలతోనే మా ఆటగాళ్లు ఉంటారు. ప్రస్తుతం మేం కొన్ని ఓటములను ఎదుర్కొన్నాం. అయినప్పటికీ మేం ఇంకా ప్లేఆఫ్స్ రేసులోనే ఉన్నాం. మాకూ ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఉన్నాయి' అని పొలార్డ్ పేర్కొన్నాడు.

ఈవార్తలు
# ప్రజావాణి
శుక్రవారం 1-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

## బెంగాల్‌లో మరో మార్పు

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక నూతన అధ్యాయం మొదలవ్వబోతోందని ఇటీవల వెలువడిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. దశాబ్దాల తరబడి సాగిన వామపక్షాల పాలనను అంతం చేసి అధికారంలోకి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్‌కు, ఇప్పుడు భారతీయ జనతా పార్టీ గట్టి పోటీనిస్తూ.. అత్యధిక స్థానాలను కైవసం చేసుకోబోతుండటం ఒక చారిత్రక పరిణామం. బెంగాల్ గడ్డపై బీజేపీ సాధిస్తున్న ఈ పురోగతి కేవలం ఒక పార్టీ విజయంగా మాత్రమే చూడలేం. ఇది క్షేత్రస్థాయిలో ప్రజలు కోరుకుంటున్న మార్పుకు నిదర్శనం. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మరియు అవినీతి రహిత పాలన పట్ల బెంగాలీ ప్రజలు ఆశలు పెంచుకున్నారని ఈ అంచనాలు చెబుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ప్రజల్లో పెరిగిన విశ్వాసమే ఈ ఫలితాలకు ప్రధాన కారణం. ఒకప్పుడు కేవలం వామపక్షాలకు, ఆ తర్వాత తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్న ప్రాంతాల్లో కూడా కమల దళం తన ముద్ర వేయడం సామాన్యమైన విషయం కాదు. హింసాత్మక రాజకీయాలు, ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి పలికి, 'అందరి అభివృద్ధి' (సబ్ కా సాథ్ – సబ్ కా వికాస్) అనే నినాదానికి అక్కడి ఓటర్లు పట్టం కడుతున్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువత బీజేపీ వైపు మొగ్గు చూపడం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్. బెంగాల్‌లో బీజేపీ సాధించబోయే ఈ గెలుపు కేవలం ఆ రాష్ట్రానికే పరిమితం కాదు. ఇది జాతీయ రాజకీయాల్లో ఆ పార్టీ పట్టును మరింత బలోపేతం చేస్తుంది. తూర్పు భారతదేశంలో బీజేపీ ప్రాబల్యాన్ని చాటిచెప్పడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఇతర రాష్ట్రాల్లో కూడా పార్టీ విస్తరణకు ఇది ఒక ఊపిరినిస్తుంది. ముగింపుగా చెప్పాలంటే, ఎగ్జిట్ పోల్స్ నిజమైతే.. బెంగాల్ రాజకీయ యవనికపై బీజేపీ ఒక అద్భుతమైన చరిత్రను లిఖించినట్లే.

# వైశాఖి పౌర్ణమి..
## ఆధ్యాత్మిక చైతన్య కిరణం

**ప్రకృతి పులకించి, వేసవి తాపం ఉన్నా మనసులో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మాసం వైశాఖం. ఈ మాసంలో వచ్చే పౌర్ణమికి భారతీయ సంస్కృతిలో, ఆధ్యాత్మిక చరిత్రలో ఎంతో విశిష్టత ఉంది. గ్రహగతులలోనూ, మానవ చరిత్రలోనూ ఈ రోజు ఒక మహత్తర మలుపుగా నిలుస్తుంది. కేవలం పౌర్ణమిగానే కాకుండా, త్రివిధ పుణ్యదినంగా భక్తులు దీనిని కొలుస్తారు. వైశాఖ పౌర్ణమి అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది బుద్ధ పూర్ణిమ.**



ఈ ప్రపంచానికి శాంతి, అహింస అనే ఆయుధాలను అందించిన గౌతమ బుద్ధుడు జన్మించినది, ఆయనకు జ్ఞానోదయం కలిగినది, మరియు ఆయన మహా పరినిర్యాణం చెందినది కూడా ఇదే రోజు కావడం ఒక అపురూపమైన యాదృచ్ఛికం. ఆసియా ఖండం మొత్తానికీ ఈ రోజు ఒక మహోత్సవం. మరోవైపు, శ్రీ మహావిష్ణువు దశావతారాలలో ఒకటైన కూర్మావతారం ధరించినది కూడా ఈ రోజేనని పురాణాలు చెబుతున్నాయి. వైశాఖ మాసాన్ని 'మాధవ మాసం' అని కూడా అంటారు. ఈ మాసంలో పౌర్ణమి నాడు నదీ స్నానం చేయడం వల్ల పాపాలు నశిస్తాయని, మోక్షం లభిస్తుందని భక్తుల నమ్మకం. ముఖ్యంగా గంగా స్నానం, కావేరీ స్నానాలకు ఈ రోజు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు. ఉదయాన్నే చేసే స్నానం, సూర్య భగవానుడికి ఇచ్చే అర్ఘ్యం మనసును, శరీరాన్ని ప్రక్షాళన చేస్తాయి. కఠినమైన ఎండలు కాసే ఈ కాలంలో, తోటి ప్రాణుల పట్ల కరుణ చూపడమే అసలైన భక్తి అని వైశాఖ పౌర్ణమి చాటిచెబుతుంది. ఈ రోజున చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, అన్నదానం చేయడం, విసనకర్రలు, నీళ్ల కుండలు దానం చేయడం వంటివి గొప్ప పుణ్యఫలాన్ని ఇస్తాయని ధర్మశాస్త్రాలు పేర్కొంటున్నాయి. బుద్ధుడి బోధనల ప్రకారం చూసినా, తోటి జీవుల పట్ల చూపే 'కరుణే' సర్వశ్రేష్ఠం. నేడు ప్రపంచం యుద్ధాలు, అశాంతి, ప్రకృతి విపత్తులతో సతమతమవుతోంది. ఇలాంటి సమయంలో వైశాఖ పౌర్ణమి అందించే శాంతి సందేశం ఎంతో అవసరం. బుద్ధుడి అహింసా మార్గం, విష్ణువు రక్షకత్వం మనల్ని ధర్మపథంలో నడిపించాలి. ఆధ్యాత్మికత అంటే కేవలం పూజలే కాదు, మనలో ఉన్న అజ్ఞానమనే చీకటిని తొలగించుకుని, జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసుకోవడమే ఈ పౌర్ణమి వెనుక ఉన్న అసలైన ఉద్దేశం. పున్నమి నాటి నిండు చందమామలా మన హృదయాలు కూడా నిర్మలంగా, వెలుగుతో నిండాలని కోరుకుంటూ.. లోకా సమస్తా సుఖినోభవంతు!



**- రామ్ మనోహర్ శర్మ బండపెల్లి,**
**ఆధ్యాత్మిక పండితుడు**
**ఫోన్ నంబర్: 091 8106194150**

# మేడే నినాదం..
## కార్పొరేట్ బంధనం




ప్రపంచ కార్మికులారా ఏకం కండి.. అన్న పిలుపు వినిపించి దశాబ్దాలు గడిచినా, నేటి ఆధునిక యుగంలో ఆ నినాదం ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదు. పారిశ్రామిక విప్లవం నాటి శ్రమ దోపిడీకి, నేటి 'కార్పొరేట్' శ్రమ దోపిడీకి మధ్య రూపం మారింది తప్ప సారాంశం మారలేదు.

**ఎనిమిది గంటల పని దినం కోసం పోరాడి సాధించుకున్న హక్కులు, నేటి డిజిటల్ యుగంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' లేదా 'హైబ్రిడ్ మోడల్' పేరుతో కనుమరుగవుతున్నాయి. నేటి కార్పొరేట్ సామ్రాజ్యం లాభాల వేటలో మానవ వనరులను కేవలం యంత్రాలుగా చూస్తోంది.**

> సాంకేతికత పెరిగిన కొద్దీ పని సులభతరం కావాల్సింది పోయి, పని గంటలు నిరంతరం పెరుగుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ చేతిలోకి వచ్చాక 'ఆఫీస్ వేళలు' అనే మాట కేవలం కాగితాలకే పరిమితమైంది. అర్ధరాత్రి వచ్చే ఈమెయిల్స్, వీకెండ్‌లో వచ్చే జూమ్ కాల్స్ కార్మికుడి వ్యక్తిగత జీవితాన్ని కబళిస్తున్నాయి. మరోవైపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్ పుణ్యమా అని ఉద్యోగ భద్రత ప్రశ్నార్థకంగా మారింది.




**- బొమ్మకంటి గంగాధర్,**
చైర్మన్, ఈవార్తలు దినపత్రిక

నైపుణ్యం లేని కార్మికులే కాదు, ఉన్నత విద్యావంతులైన టెక్కీలు కూడా ఎప్పుడు 'లేఆఫ్స్' బారిన పడతామో తెలియని ఆందోళనలో బతుకుతున్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో, ప్రముఖ పారిశ్రామికవేత్తల నుంచి వారానికి 70 గంటల పని చేయాలనే ప్రతిపాదనలు రావడం ఆందోళనకరం. ఇది శతాబ్దం క్రితం సాధించిన 8 గంటల పని హక్కును కాలరాయడమే. స్విగ్గీ, జొమాటో, ఉబెర్ వంటి సంస్థల్లో పనిచేసే డెలివరీ బాయ్స్, డ్రైవర్లను 'భాగస్వాములు' అని పిలుస్తూ వారికి కనీస వేతనం, బీమా, పింఛను వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆర్థిక మాంద్యం సాకుతో ప్రపంచవ్యాప్త దిగ్గజ సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. లాభాల్లో ఉన్నప్పుడు బోనస్‌లు ఇచ్చే సంస్థలు, స్వల్ప నష్టాలు రాగానే కార్మికులను రోడ్డున పడేస్తున్నాయి. కార్పొరేట్ లక్ష్యాలను చేరుకోవాలనే ఒత్తిడిలో యువత డిప్రెషన్, గుండెపోటు వంటి అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు. 'వర్క్-లైఫ్ బ్యాలెన్స్' అనేది నేడు ఒక విలాసవంతమైన మాటగా మారిపోయింది. గతంలో కార్మికులకు అండగా ఉండే ట్రేడ్ యూనియన్లు కార్పొరేట్ శక్తుల ఒత్తిడికి తలొగ్గడం లేదా రాజకీయీకరణ చెందడం వల్ల కార్మికుడు ఒంటరివాడవుతున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో శాశ్వత ఉద్యోగాల స్థానంలో 'అవుట్ సోర్సింగ్' మరియు 'కాంట్రాక్టు' పద్ధతి పెరగడం వల్ల సమాన పనికి సమాన వేతనం అందడం లేదు.

### వైట్ కాలర్ ముసుగులో శ్రమ దోపిడీ

ఐటీ రంగం నేడు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోంది. అయితే, మేడే (మే 1) ఆశయాల నేపథ్యంలో ఐటీ ఉద్యోగుల స్థితిగతులను పరిశీలిస్తే, అక్కడ వైట్ కాలర్ ముసుగులో జరుగుతున్న శ్రమ దోపిడీ స్పష్టంగా కనిపిస్తుంది. మేడే పుట్టిందే రోజుకు 8 గంటల పని దినం కోసం. కానీ ఐటీ రంగంలో లాగిన్, లాగౌట్ సమయాల మధ్య వ్యత్యాసం తగ్గిపోయింది. 9 నుండి 10 గంటల పని అనేది కనీస అవసరంగా మారింది. ప్రాజెక్ట్ డెడ్‌లైన్ల పేరుతో అర్ధరాత్రి వరకు పనిచేయడం, వీకెండ్స్‌లో కూడా అందుబాటులో ఉండటం ఐటీ ఉద్యోగికి తప్పనిసరి అయ్యింది. ఇది ఒక రకమైన 'డిజిటల్ బానిసత్వం'గా మారుతోంది. పారిశ్రామిక కార్మికులకు ఫ్యాక్టరీ గేటు దాటితే పనితో సంబంధం ఉండదు. కానీ ఐటీ ఉద్యోగికి ఇంటికి వెళ్లినా స్లాక్, వాట్సాప్, ఈమెయిల్స్ రూపంలో ఆఫీస్ వెంటే ఉంటుంది. నేటి మేడే నినాదాల్లో "పని తర్వాత ఆఫీస్ నుండి విముక్తి" లేదా 'రైట్ టు డిస్‌కనెక్ట్' అనేది ఐటీ ఉద్యోగులకు అత్యంత అవసరమైన హక్కు. గతంలో ఐటీ అంటే ఒక కలల ఉద్యోగం. కానీ నేడు 'లేఆఫ్స్' అనే పదం ఐటీ ఉద్యోగుల గుండెల్లో నిద్రపోతోంది. వేల కోట్ల లాభాలు గడించే సంస్థలు సైతం, మార్కెట్ ఒడిదుడుకుల నెపంతో నిమిషాల వ్యవధిలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కార్మిక చట్టాల రక్షణ ఐటీ రంగానికి అంతగా వర్తించకపోవడం వల్ల ఉద్యోగి ఎప్పుడు రోడ్డున పడతాడో తెలియని అనిశ్చితి నెలకొంది. సంప్రదాయ కార్మికులకు బలమైన యూనియన్లు ఉంటాయి. ఐటీ రంగంలో అటువంటి సంఘాలు తక్కువ. ఐటీ ఉద్యోగులు తమను తాము 'కార్మికులు'గా కంటే 'ప్రొఫెషనల్స్'గా భావించడం వల్ల, సమస్యలు వచ్చినప్పుడు సంఘటితంగా పోరాడలేకపోతున్నారు. ఫలితంగా యాజమాన్యాల ఏకపక్ష నిర్ణయాలకు బలి అవుతున్నారు. శారీరక శ్రమ చేసే కార్మికులకు కండరాల నొప్పులు ఉంటే, ఐటీ ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిడి, నిద్రలేమి, వెన్నుముక సమస్యలు, కంటి జబ్బుల బారిన పడుతున్నారు. 'బర్న్ అవుట్' (అలసట) కారణంగా చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్న ఐటీ ఉద్యోగుల సంఖ్య పెరగడం విషాదకరం. పారిశ్రామిక విప్లవంలో యంత్రాలు ఎలాగైతే కార్మికుల పనిని వేగవంతం చేశాయో, ఇప్పుడు ఐటీలో కృత్రిమ మేధ అదే పాత్ర పోషిస్తోంది. కొత్త టెక్నాలజీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు మారకపోతే ఉద్యోగం పోతుందనే భయం, నిరంతరం నేర్చుకోవాలనే ఒత్తిడి ఐటీ రంగంలో కార్మికుడిపై అదనపు భారాన్ని మోపుతున్నాయి. మే 1 కేవలం సెలవు దినం కాదు.. అది కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీక. లాభాల వేటలో మనిషిని మరచిపోతున్న కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా చట్టాలు మరింత పటిష్టం కావాలి. ప్రభుత్వాలు కేవలం పెట్టుబడులకే ప్రాధాన్యం ఇవ్వకుండా, ఆ పెట్టుబడులకు ఊపిరి పోస్తున్న కార్మికుడి సంక్షేమాన్ని కూడా బాధ్యతగా తీసుకోవాలి. అప్పుడే నిజమైన శ్రమకు గౌరవం దక్కుతుంది. మేడే సందర్భంగా ఐటీ ఉద్యోగులు కూడా తమ హక్కుల గురించి, పని-జీవిత సమతుల్యత గురించి గొంతు ఎత్తాల్సిన అవసరం ఉంది. కేవలం ప్యాకేజీల మీద కాకుండా, పని నాణ్యత, మానసిక ప్రశాంతత మీద దృష్టి సారించడమే నేటి ఐటీ కార్మికుడికి అసలైన నివాళి.




**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.